# ఎల్లోరా కవిత


# గుప్పెడు తరంగాలు



894.8271
ELL

C I

AOUA1013106




V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10314

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10314

# NISSHABDA THARANGALU

*(an Anthology of Poetry)*

*By*

**ELLORA**

*First Edition 1976*

*Wrapper Design by*

**BAPU**

**Price Rs. 6-00**

T
894.8271
ELL

*Published by*

**(C) SRINIVASA PUBLICATIONS,**
63, Venkatarangam Pillai Street,
Madras-600 005.

*Also copies available from :*

**Visalandhra Prachuranalayam,**
*Eluru Road, Vijayawada-2.*

**Navodaya Publishers,**
*Eluru Road, Vijayawada-2.*

**M. Seshachalam & Co.,**
*Madras-600 001.*

**Andhra Pradesh Book Distributors,**
*Rashtrapathi Road, Secunderabad-3.*


**Desi Book Distributors,**
*Vijayawada.*

**Desi Book House,**
*Hyderabad-29.*

*Printed at*

**Weldun Press, 7/1, Mannappa Mudali Street,**
**Madras-600 021.**

# అంకితం



మానవత చిగురించాలని
జాతి మనుగడ ధర్మపథంలో
పయనించాలన్న ఆశయాలను
జీవితంలో ఆచరించి
సమాజానికి మార్గదర్శకులుగా
నిలిచి తరించిన పుణ్యదంపతులు

శ్రీమతి ప్రేమేశ్వరి,

శ్రీ బులుసు రామలింగేశ్వరుడు గార్లకు

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.



## ★ ఎల్లోరా

* జననం కోనసీమలో
* యువ జనోద్యమాలలో పాల్గొన్నాడు
  పత్రికా రచయితగా స్థిరపడ్డాడు
* 'సినీప్రభ' సంపాదకుడుగా,
  'ఆంధ్రజ్యోతి' ఉపసంపాదకుడుగా,
  'ఆంధ్రప్రభ' ఉపసంపాదకుడుగా
  ఉన్నాడు. ప్రస్తుతం
  'ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక'
  సంపాదక వర్గంలో సభ్యుడు
* సుమారు 30 రచనలు—
  'మధుర కవితలు', 'ప్రాచీన కళలు',
  'కాలచక్రం' (నవల) మొదలైనవి
  ముద్రితాలు
* జానపద సాహిత్యంలో
  ప్రత్యేకంగా కృషి చేశాడు.
  వక్త, విమర్శకుడు,
  అభ్యుదయ సాహితీ వేత్త.

# ఆశీస్సులు

—విద్వాన్ విశ్వం

చందమామ రావె
జాబిల్లి రావె
కొండెక్కి రావె
గోగుపూలు తేవె ... ....

అనే ఇల్లాలు అప్రయత్నంగా తన శిశువు హృదయంలో కవిత్వ బీజాన్ని నాటుతున్నది.

ఆ చందమామ రాడు; ఆ జాబిల్లి రాడు. కొండెక్కి రాడూ; గోగుపూలు తేడూ.

ఈ సంగతి తల్లికి తెలుసు. అయినా, ఆ పాట ఎందుకు పాడుతుంది? ఆ మాటలకు మామూలు అర్థం కాక ఏదో వేరే భావం అందులో భాసిస్తుందని తెలిసినా, తెలియకపోయినా తనకు తెలుస్తూనే ఉంటుంది.

ఏది కవిత్వం అంటే పండితాఖండలులే చెప్పడానికి చేటభారతాలు రాస్తారు. మరి ఆ మామూలు ఇల్లా లేం చెప్తుందీ! అయినా, ఆమె కవిత్వం చెప్తున్నది, ఆ పసిపాప విని కిలకిల మంటున్నది.

అదే కవిత్వంలోని విశేషం.

ఏడవాకు ఏడవాకు
ఎఱ్ఱి నాయన్నా
ఏడిస్తే నీ కళ్ళ
నీలాలూ కారూ

అనే తల్లికీ కవితా హృదయం తెలుసు.

తొలకరి ఒక మబ్బు
తొంగి చూచింది
మబ్బులో ఒక మెఱపు
మెఱసిపోయింది.

మెఱపులో ఒక జల్లు
కురిసి వెలిసింది
జల్లులో నా మనసు
జారిపోయింది

అన్న జవరాలికీ ఆ త త్త్వం తెలుసు.

ఏనాడులో ఎఱ్ఱగడ్డలో
జిల్లేడు చెట్టు కింద
మల్లె మొగ్గలో

అని పాడే పసుల కాపరులకూ తెలుసు.

ఓ వేదాంతి నేతి రుచి ఎలా ఉంటుందీ అంటే ఏం చెప్తాం? అది అనుభవైక వేద్యం అని అంటాడు సామ్యం చెప్తూ.

అలాగే కవిత్వ మన్నా మనం నిర్వచించడం అంత తేలిక కాదు.

ఇంతకూ నిర్వచనాలు దేనికీ?

చదివితే మీ గుండె చెప్తుంది ఏది కవిత్వమో? మీ కళ్ళు చెప్తాయి ఏది కవిత్వమో? మీ బుద్ధి చెప్తుంది ఏది కవిత్వమో? మీ ఆత్మ చెప్తుంది ఏది కవిత్వమో? ఎటువచ్చీ చెప్పలేనిదల్లా మీరే!

ఈ మీరులో నేనూ ఉన్నాను. మేమూ ఉన్నాము. మీరూ మేమూకూడా చెప్పడం కష్టమైన ఈ కవిత్వం చర్చిస్తే మటుకు ఇట్టే తెలిసిపోతుంది.

ప్రతి కళకూ ఓ శాస్త్రం ఉంటుంది. ప్రతి శాస్త్రాన్నీ ఓ కళగా సాధించే వారూ ఉంటారు.

శాస్త్రం క్షుణ్ణంగా తెలిసిన వాడు పడికట్టు రాళ్ళతో కొఱుకుడుపడని పంక్తులు అల్లడు.

అలాగే కళలోని మర్మం ఎఱిగినవాడు శాస్త్రం ప్రసక్తి లేకుండానే అందు లోని ఆనుపానులు ఇట్టే తేల్చి చెప్పగలడు.

చదువులన్నీ చదవడం ఎవరికీ సాధ్యం కాదు. కనుకనే 'చదువులలో మర్మ మెల్ల చదివితి, తండ్రీ' అన్నాడు ప్రహ్లాదుడు.

ఆ మర్మజ్ఞత కావాలి. ఆ హృదయ పరిగ్రహణం కావాలి. అప్పుడు కవిత్వం ఇట్టే తెలిసిపోతుంది.

తెలుసుకోవాలంటే తెలివి ఉండాలి. తెలివిగలవా డనిపించుకోవాలంటే చాలా సంగతులు తెలిసి ఉండాలి. ఇదో విరోధాభాసం.

అవన్నీ అలా ఉంచి ఎల్లోరా ఏమంటాడో అని చూతాం.

"అక్షరాలకు మాటలు నేర్పి, పాటలు నేర్పి
ఆడిస్తాడు, పాడిస్తాడు
పలికిస్తాడు అక్షర శిల్పి
నల్లని రాలకు ముక్కులు చెక్కి
వెన్నలాంటి మనసు నిచ్చి
ఆ శిల్పంలో కళామతల్లిని
ఓ యని పలికిస్తాడు శిల్పి
శిల్పం అంటూ ఉంటే
రాయి అయినా రాత అయినా
మనసుని పలకరిస్తుంది
మనిషిని వరిస్తుంది."

అదిగదీ సంగతి. అయితే, ఇంతే సంగతులూ అని ముగించగలమా? లేదట!

"శతాబ్దాల అన్యాయాల
దురహంకారానికి అగ్ని ముట్టిస్తా
శతాబ్దాల పెను నిద్దుర
వదిలించేందుకు
మేలుకొలుపులు ఆలపిస్తా
చీకటికి నిప్పంటించి
వెలుగు పందిళ్ళ నీడల్లో
నా జనానికి నవ్వు అందిస్తా
కాలపు పాషాణ శిథిలాలలో
బందీ అయిన నాగరకతను త్రవ్వి తీసి
నవజగత్తు పునాదులు నిర్మిస్తా...."

అదిగదీ అసలు సంగతి.

కవిత్వం అలరించాలి. అంతేకాదు, నిన్ను కదిలించాలి. అంతేనూ కాదు, నిన్ను ముందుకు నడిపించాలి.

నీ తోడివారిలో మంచిని పెంచి, నీ చుట్టూరా ఉన్న కశ్మలాన్ని తొలగించి, నీ లోనా వెలుపలా ఉన్న పాపాలను సంక్షాళితం చేసి, నీవూ నీ తోడివారూ నవజగత్తును నిర్మించుకునేందుకు, నవనీతిని వ్యవస్థీకరించుకునేందుకు నీకూ వారికీ బాసటగా కవిత కదలాలీ, కదలాలీ, పెను నిద్దుర వదిలించాలీ.

అలాంటి కవిత్వం ఎల్లోరా 'నిశ్శబ్ద తరంగాల'లో నిశ్శబ్దంగా నిండి నిబిడీకృతమై ఉన్నది.

అతని మాటలలోనే—

"పిడికెడు గుండెలో
విశ్వమానవ చరిత్రను
విరచించి భద్రపరచుకున్న
పూర్ణ చరిత్ర ఇది
ఒక్క పంక్తిలో
ప్రపంచ మానవాళి ఆశయాలను
నినదించి వినిపించిన
సమతాగ్ర కేతనం ఇది.
పాల్ రాబ్సన్ సంగీతాన్ని
కాళిదాసు మేఘసందేశాన్ని
సమానంగా హృదయంలో దాచుకొని
పచ్చికలమీద పిట్టలబారు
ఆటలతో జోడు కలిపి
నా కోర్కెలను ఎగరేస్తున్న
ఆనంద రసవాదిని
నవ సమాజవాదిని."

అంతేకాదు, దాన్ని వివరించాడు కూడా.

"దీపాలు వెలిగించండి
చీకటికి చెల్లు చీటీలు రాపి ఉంచండి
దీపాలు ముట్టించండి
స్వార్థాలు మండించండి

జ్యోతుల తోరణాలు అలంకరించండి
జ్యోత్స్న తరంగాలు ఆడుకోనివ్వండి
చీకటి రాక్షసి సంహారానికి
గాండీవం ధరిస్తున్నాను నా జనాన్ని
ఆదుకోవడానికి
సవ్యసాచినై నిలుస్తున్నాను
నా దేశం ప్రగతి ప్రమిదల్లో
క్రాంతి దీపాలు వెలిగించడానికి!"

అంటాడు తను.

"నా పాట భవిష్యత్తుకు పిలుపు
దాని రంగు ఎరుపు
చిట్టచివరకు దాని తత్త్వం గెలుపు
సూర్యునిలో వేడిని తాగి
చంద్రునిలో వెన్నెల మేసి
నయాగరా పరవళ్ళలో
విద్యుత్తును అక్షరాలకు అద్ది
దీపస్తంభాలుగా నిలిపిన పాట ఇది
యువత బాటలో వెలుగు వెలార్చే
క్రాంతి దివిటీల పాట ఇది."

'క్రాంతి దివిటీల తోట ఇది' అంటే ఇంకింత బాగుండునా!

ఔ నిది దివిటీల తోట, తియ్యని పాట, దివ్యత్వానికి బాట.

ఇలాంటి దానికి నేను మరో పేట అల్లడం ఎందుకు?

మొనమొన్న 'రేపటి వసంతం' వెలువరించి 'ఓహో' అనిపించుకొని. అంతలోనే ఈ 'నిశ్శబ్ద తరంగాల'తో నిన్నూ, నన్నూ అలరిస్తున్న ఎల్లోరా నాకు అతి సన్నిహితుడు. అతణ్ణి మనసారా ఆశీర్వదిస్తున్నాను.

ఇంకా వ్రాయి, ఇంకా వ్రాయి.

ఇంకింతగా ప్రజా మనోరథాలను పలికించు, పులకించు.

వెయ్యేళ్ళపాటు వర్ధిల్లు, ఎల్లోరా!

*

# కృతజ్ఞతలు

'నిశ్శబ్ద తరంగాలు' గ్రంథరూపంలో తెమ్మని భుజం తట్టి, అండగా నిలబడిన ఆత్మీయులు, సాహితీపోషకులు శ్రీ బి. వి. ఎస్. ఎస్. మణిగారికి....

ఇందులోని కవితలను ముందే ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రికలో ప్రచురించి నా కెంతో ప్రోత్సాహాన్ని అందించిన మా విద్వాన్ విశ్వంగారికి....

ఇందులో కొన్ని ప్రసారంచేసిన ఆలిండియా రేడియో మద్రాసు వారికి....

నేను చేస్తున్న సాహిత్యకృషికి ప్రతి క్షణం మేం ఉన్నాం, ముందుకు నడవండి అంటూ నాకు ప్రోత్సాహాన్ని ఇచ్చి ప్రక్కన నిలబడి ఆత్మ స్థైర్యాన్ని కలిగిస్తున్న మిత్రులకు...

కవరును ముచ్చటగా అలంకరించిన ప్రముఖ చిత్రకారులు శ్రీ బాపుగారికి....

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ వారికి....

కవరును అందంగా ముద్రించి ఇచ్చిన మద్రాసు జాబ్ ప్రెస్ వారికి....

సంపుటిని ఆకర్షణీయంగా ముద్రించిన వెల్డన్ ప్రెస్ వారికి ...

# వచన కవితా ప్రక్రియ

విశ్వమానవ కళ్యాణవేదిపై నిలిచి నవతాశంఖాన్ని, ఆధునిక కవితా చేతనను ప్రదీప్త మొనరిస్తున్నాడు నూతన భావమేధస్సంపన్నుడైన ఆధునిక కవి. నాలుగో, అయిదో సుందర శబ్దాలను లేదా అలంకారాలను ప్రయోగిస్తే ఆనాడు అది కవిత అనిపించుకొంది. అతడు కవి అనిపించుకొన్నాడు. ఆధునిక మానవ మేధస్సు నుంచి వీచే ఆధునిక సాహిత్య వైజ్ఞానిక ఝంఝా ప్రభంజనంలో అవి ఎప్పుడో ఎగిరిపోయాయి. దీర్ఘసుషుప్తినుంచి మానవుడు మేల్కొన్నాడు. ఆ మేలుకొన్న సంకేతమే ఆధునిక కవితావిష్కరణం.

"సమాజానికీ, సాహిత్యానికీ బింబ ప్రతిబింబ భావం నిసర్గం. ఈ సూత్రం సమష్టిగానే కాదు, వ్యష్టిగా కూడా నిజం. కావ్యంలో ప్రతిబింబించేది కవి భౌతిక రూపం కాదు. అది కవి అంతరాత్మ. ఏ కావ్యం సమాజధర్మాన్నీ, యుగధర్మాన్నీ ప్రతిఫలిస్తుందో, ప్రబోధిస్తుందో ఆ మహా కావ్యం, ఆ కవిత, ఆ కవి ఆ యుగానికి ఆచార్యత్వం వహిస్తారు.

ఈ మధ్య ఆధునిక కవితా చేతనను పరిశీలిస్తే ఇవి అంచెలంచెల దివికి ఉయ్యాలగా గోచరిస్తుంది.

సాహితీ ప్రవంతిలో పాత కెరటం వెడితే కొత్త కెరటం వస్తూంటుంది. అందుకే సాహిత్యం సమాజ ప్రతిబింబం. ఆర్తధ్వనులూ, ఆనంద ధ్వనులూ అందులోనే ప్రతిధ్వనిస్తాయి. అయితే, గతంలోకంటే ప్రస్తుతంలోని సాహిత్యంలో "కమిట్‌మెంట్"కు ప్రాధాన్యం కనిపిస్తూంది.

వాస్తవికతతోపాటు అధివాస్తవికత, వ్యక్తి చైతన్యంతోపాటు సంఘ చైతన్యం సమానాధికారంతో ప్రవచించిన కాలం ఇది. గత తార్కిక భౌతికవాద ప్రేరణను కవితలో వినిపించినవాడు శ్రీశ్రీ.

అతి నవ్య కవితకు శ్రీశ్రీ, నారాయణబాబు, పట్టాభి పునాదులు వేశారనుకోవాలి. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సిద్ధాంతం అధివాస్తవికతకు మార్గదర్శి.

కవిత్వానికి ఆవేశం అప్రధానం కాదుగాని, ఆర్తి ప్రధానం. కవిత్వంతో సమాజాన్ని ప్రభావితం చెయ్యలేమనే దౌర్బల్యం ఎప్పుడైతే ప్రబలిపోతుందో, ఆ క్షణమే తిట్లు, వ్యక్తిగత దూషణలు, ఈర్ష్య, క్రోధం, పగ ప్రత్యక్షం కావడం

జరుగుతుంది. దీనికి కారణం-బలమైన శబ్దచిత్రాలలో కవి ఆర్తిని పలికించలేనప్పుడే దుర్బలమైన ఆవేశంతో కవిత్వం చౌకబారుగా అందించడం చేస్తాడు.

ప్రచార కవిత్వం వేరు, ప్రబోధ కవిత్వం వేరు. రెండూ ఒక్కచోట కాపురం చెయ్యలేవు. కవిత్వానికి ఆర్తిని అద్దితే చైతన్యప్రబోధం తొణికిసలాడుతుంది. ఆర్తిన్ని మినహాయించితే పదాల గారడీ ప్రచార కవిత్వంగా రూపొందుతుంది.

కవి కాంతి దర్శకుడూ, క్రాంతి ప్రబోధకుడూ కూడాను. రవి గాననిచో కవి గాంచగలడన్నది అందుకే.

రచయిత ప్రత్యక్షంగా ప్రజాపోరాటాలలో పాల్గొనకుండా పోరాటానికి జనాన్ని తన కవితలద్వారా స్పందింపజేసి, ప్రబోధించి ముందుకు కార్యోన్ముఖుల్ని చేయడం అవసరం.

అభ్యుదయభావం, ప్రగతి దృక్పథం, సమసమాజ స్థాపనాశయం మనిషిలో పెరిగే భవిష్యత్ ఆశకు ఆశయంగా వెలువడిన మానవతాదృక్పథం. తన చుట్టూ తిరుగుతున్న కాలపు విలువలు, సమాజ పరిస్థితులు, సంఘంలో తాను అనుభవి స్తున్న అనుభూతులు, అనుభవాల ప్రేరణ, తోటివారి కన్నీరు, సాటివారి బాధలు, బహుజన దాస్యం, దారిద్ర్యం, దోపిడీ, మోసం, జులుం- ఇవే కవిని, రచయితని అభ్యుదయంవేపు చూడమంటాయి. ప్రగతివేపు నడిపిస్తాయి. విప్లవాత్మక సాహితీ సృష్టికి ప్రేరేపణ గావిస్తాయి.

కాని, ఇలా ప్రగతిభావనలో రచనలు చేసే నవ్యులు మార్క్సియ సిద్ధాంతానికి దగ్గరగా కనిపిస్తారు!

ఎవరు ఏ దృక్పథాన్ని అభిమానించినా కవి ఆశయం, కవితాశయం కదిలేది, కదిలించేది, పాడేది, పాడించేది. మునుముందుకు నడిపించే కవితాసృష్టి రచనో ద్యమం కావాలి! రావాలి!!

ఈ విషయాన్ని ఎవరూ కాదనరు. ఈ దృక్పథమే అందరూ కోరతారు. అందరూ కోరడంలోనే కాస్త గజిబిజి కలుగుతుంది. కేపిటలిస్టు దేశాలుకూడా ఈమధ్య సోషలిజం కోరుతున్నాయి.

అందుకే- "కమిట్ మెంట్" వినాదం ప్రారంభం అయిందేమో! మార్క్సిస్ట్ ఫిలాసఫీతో కూడిన సోషలిస్ట్ అవగాహన ఉంటేనే అది ప్రగతి రచన అంటున్నారు.

నిజమైన కవి ప్రజాజీవితంనుండి తప్పించుకొని తిరగలేడు, రాయలేడు.

"ఈవేళ కవిత్వం రాయాలంటే ఉత్సాహం మాత్రమే చాలదు. విప్లవ చైతన్యం కూడాలి. ఈ చైతన్యం మార్క్సిస్ట్ సిద్ధాంతంతో వెలిగించబడినప్పుడే కవిత్వం ఉన్నతోన్నత శిఖరాల నందుకోగలదు" అంటున్నాడు శ్రీశ్రీ.

లెనిన్ అన్నట్లు—"ఆశయానికి, ఆచరణకి మధ్య అగాధం ఉన్నంతకాలం ఏ సిద్ధాంతమూ నిష్ప్రయోజనమే."

"మాకు కొత్తా వద్దు, ఏదీ వద్దు. హాయిగానే బ్రతుకుతున్నాంకదా. ఇలా బ్రతకనివ్వండి" అనే బాపతువాళ్ళే ప్రపంచంలో ఎక్కువమంది. ఈ రకం మనుష్యులు సంఘానికి, సమాజానికి చాలా ప్రమాదకరం. దీనిని సమూలంగా నిర్మూలించనిదే కొత్తది ఆవిష్కరించడం, సాధించడం కష్టం" అన్న గోర్కీ పలుకులు గమనార్హములు.

తెలుగు సాహిత్యంలో, కవిత్వంలో వచ్చినన్ని ఉద్యమాలుకానీ, పరిణామాలుకానీ మరే ప్రక్రియలోనూ రాలేదు. సమాజ రుగ్మతల సమూల విచ్ఛేదం చేయడానికి కవితా పరశువును ధరించడం అవసరమే.

"నిత్య విప్లవశీలమైన సాహిత్యం మోడువారదు" అని పేర్కొన్నారు మాథ్యూ ఆర్నాల్డ్. ఇది పచ్చి నిజం.

అయితే, వచ్చు కాలంకంటే గత కాలమే విలువైనదని ప్రాచీనాన్ని అందలం ఎక్కించి, ఆ సంప్రదాయంలోనే సాహిత్యాన్ని బళ్ళకొద్దీ సృష్టిస్తున్నవారూ ఉన్నారు. వీరు, వీరి శిష్య అనుయాయులు వర్తమానంలో జీవిస్తున్నా, గతంలో బ్రతుకుతుంటారు. వీరి దృష్టిలో గతమంతా స్వర్గమయం; ప్రస్తుతం అప్రస్తుతం.

సనాతనవాదులు అలంకార శాస్త్రాల ఆసరాతో, ఛందస్సుల కాపలాతో రాయల కాలంనాటి పద్య, గద్య ప్రబంధాలనే కాస్తో కూస్తో తేడా ఉన్నా, ఆ పాత వస్తువులతోనే సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. విచిత్రం ఒకటి ఉంది. వీరిలో కొందరు ఎన్నుకొనే వస్తువులో కొత్త చూపించి గద్య, పద్య ప్రబంధాలనే సృష్టిస్తూ పోతున్నారు.

జాతి జీవితం సనాతన ధర్మంపై కొనసాగాలనే సనాతనవాదులూ, ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితాల కనుగుణమై, నవీన జీవనవిధానం కలిగి ఉండాలనే అభ్యుదయవాదులూ నేడు రచనలు చేస్తున్నారు.

ఒకనాడు అభ్యుదయ కవిత్వం ఎన్నో విమర్శలకూ, దాడులకూ గురి అయినా, నేడు అది ఒక మహా శక్తిగా రూపొంది, లక్షలాది అనుయాయులతో తెలుగు భారతిని కవితా నీరాజనాలతో అలంకరిస్తున్నది.

"కవిత్వానికి వస్తువు కాని దేదీ నేడు లేదు. స్నేహం, స్వేచ్ఛ, వినయం, కృతజ్ఞతవంటి చిరంతన మానవ మానస లక్షణాలను కొందరు రమణీయార్థ ప్రాతిపదికలుగా తీర్చిదిద్దుతున్నారు."

తెలుగు భాషలో వచన కవిత్వం అవతరణ ప్రయోగవాదులకు విజయమే. ప్రయోగ, ప్రగతివాద శిబిరాల్లో కవులు ప్రముఖులు ఉండడంవలన ప్రగతివాదంలోకి

ఈ వచన కవిత చొచ్చుకొని వచ్చిందనే చెప్పాలి. వాస్తవిక కవితల్లోనేకాక, శ్రీశ్రీ 'మహా ప్రస్థాన' రచనల్లోనూ ఈ వచనపద్యం చోటు చేసుకున్నది.

శ్రీశ్రీతో ప్రారంభమయిన ఆధునిక కవితోద్యమం 'మహా ప్రస్థానం'తో ప్రారంభమయినా, ఆరుద్ర 'త్వమేవాహం'తో ఆధునికముద్ర సంతరించుకొన్నది. ప్రేరణను కల్పించింది. 1950 దాటేటప్పటికి వచన కవిత ఒక సమగ్ర స్వరూపం దాల్చింది. ఈ తరహా కవితలను విరివిగా చేసినవారిలో శ్రీశ్రీ, ఆరుద్ర, అజంతా, బైరాగి, కుందుర్తి, కవిరాజమూర్తి, వరద, తిలక్, రాజశేఖర్ ఉన్నారు. వచన కవితకు తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', ఎల్లోరా 'రేపటి వసంతం'లో ఒక ఆకర్షణను చేకూర్చారు.

నేడు వచన కవితను చేపట్టి ఉద్యమంగా రూపొందిస్తున్న వారిలో కుందుర్తి, అరిపిరాల, శేషేంద్రశర్మ, ఎల్లోరా ముఖ్యులు. వీరి కవితలలో ప్రకృతి పలకరిస్తుంది, గుండె పాడుతుంది. కవిత సాంతం చదివితే ప్రేమైకమూర్తి చిత్రం దర్శనం ఇస్తుంది.

ఇంకా మాదిరాజు రంగారావు, గోపాలచక్రవర్తి, శీలా వీర్రాజు, వి. కృష్ణారావు, సంపత్కుమార్, వరవరరావు, శివారెడ్డి, శివప్రసాద్, అద్దేపల్లి రామమోహనరావు, వేగుంట మోహనప్రసాద్ ప్రభృతులు ఎందరో ఉన్నారు.

ఆధునిక కవితా శిఖరాలపై నిలిచి అపూర్వ కవితాసృష్టి చేస్తున్న డాక్టర్ నారాయణరెడ్డి, దాశరథి, ఆరుద్రల ప్రతిభ అపూర్వం.

వచన కవిత్వంద్వారా సాధించిం దేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

తెలుగు కావ్యభాష వెయ్యేళ్ళ తరవాత సంపూర్ణంగా పరివర్తన చెందడం, ప్రజలు మాట్లాడుకునే భాష స్వయంగా కావ్యంలోకి సర్వాంగసుందరంగా ప్రవేశించడం.

అయితే, వచన కవిత్వానికి ఒక లక్షణం రూపొందాలి. అందుకు చేసే ప్రయత్నాలు. పరిశోధనలు విజయవంతం అవుతున్నట్లే తోస్తుంది. కారణం వచన కవిత్వంలోనే కొన్ని కథాకావ్యాలు వెలువడుతున్నాయి.

ప్రపంచంలో విఖ్యాతులైన మహాకవులు అందరూ, ప్రజాకవులు అందరూ ఏదో ఒక సమయంలో, ఏదో ఒక చరణంలో ప్రియురాలిని పలకరించిన జాడలు కనిపిస్తాయి. ప్రియురాలిని తలుచుకొని పాటల్లో అలంకరించుకొన్న ఘట్టాలు కనిపిస్తాయి.

తెలుగు దేశంలో విప్లవాన్ని కోరే ప్రతి అభ్యుదయ కవీ, విప్లవ కవి మిత్రు లందరూ కాస్తో కూస్తో తేడాలో ఏదో ఒక సుముహూర్తంలో ఆనందం అందలా లెక్కించి, క్షణంలో అక్షరాలచేత కన్ను గీయించారు; కొప్పులో గుప్పెడు పూలు అలంకరించారు. శ్రీశ్రీ, ఆరుద్ర, నిఖిలేశ్వర్, దాశరథి, నారాయణరెడ్డి, ఎల్లోరా, సోమసుందర్, తిలక్, గుంటూరు శేషేంద్రశర్మ ప్రభృతుల కవితలలో ఈ విషయం మనకు తెలుస్తుంది!

అభ్యుదయ కవి అయినా, విప్లవ కవి అయినా ప్రగతి భావంతో కవితలు రాస్తూ, సమాజాన్ని మేలుకొలుపుతూనే, నిత్య జీవితంలో ప్రకృతి ధర్మమైన ఆనంద మందారాలకు మాలలు అల్లడం, శృంగారాన్ని తేనె సోనల హృదయవీణమీద పలికించడం తప్పు కాదు.

నిజాన్ని కాలం నిర్ణయిస్తుంది! నిజానిజాలకు కాలం సానపడుతుంది! యథార్థానికి ప్రగతి భావానికి భవిష్యత్తు రత్నకిరీటాన్ని ఆవిష్కరించడానికి చైతన్య స్వరూపమైన అగ్నిగానాన్ని ఆలపిస్తుంది.

వచన కవిత్వ ఉద్యమకర్తలలో ప్రముఖులు, ఆత్మీయులు మిత్రులు మా కుందుర్తి అన్న మాటలు గమనార్హం.

"అభ్యుదయ కవితా యుగంలో కావ్యవస్తువు కొన్ని పరిధులకు లోబడి, కొన్ని నిర్దిష్టాంశాలకు మాత్రమే పరిమితమై పోయినట్లు కనిపించింది. ఆరంభ దశల్లోని ఆవేశం అలాగే ఉంటుంది. దాని పరిధిని విస్తృతపరచి, దానిని జీవితం లోని సర్వ రంగాలకూ వ్యాపింపజేయాలనే ప్రయత్నం వచన కవితా యుగంలో వచ్చిన కొత్త మార్పు. అన్ని రసాలను వచన కవిత్వంలో నిర్వహించి ఒప్పించా లనే అస్మదాదుల ఆకాంక్షకు ఉదాహరణగా ప్రారంభమైన కవిత్వం తిలక్ రాసి చూపించాడు. "నువ్వు లేవు నీ పాట ఉంది" వంటి గేయాలు వచన కవితా ప్రక్రియలో ప్రేమభావనలుకూడా ఎంత సుందరంగా చెప్పడానికి వీలుందో నిరూపిస్తాయి. శృంగారాది ఇతర రసాలకు కూడా వర్తించగల విధంగా వచన కవితా ప్రక్రియలో ఇప్పుడు వచ్చిన ఈ మార్పును మొత్తంమీద కవిత్వంలో సామాజిక ప్రయోజన చైతన్యమనే పరమ లక్ష్యానికి భంగం లేనంతవరకు నేను హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తాను."

మా కుందుర్తి అన్నట్లు సామాజిక ప్రయోజన చైతన్య మనే పరమ లక్ష్యానికి తిలక్ రాసిన కవిత అయినా, ఎల్లోరా రాసిన కవిత అయినా భంగం కాదనే నా నిశ్చితాభిప్రాయం. జీవితంలో రహస్యంగా శృంగారాన్ని జుర్రుకొంటూ, కవితలో అడపా దడపా భావకవిత్వ ధోరణిలో శృంగార కవితలు రాస్తే భయపడే వారిని చూసి నేను కసురుకోను; జాలిపడతాను.

నేను నా కవితలలో మిశ్రమ సంప్రదాయాన్ని—అంటే అభ్యుదయ ప్రబోధాత్మక కవిత్వం, ప్రకృతిసిద్ధ భావ కవిత్వం రెండూ రాస్తాను.

ఎంత అభ్యుదయ కవిత్వమైనా సుందరంగా కవితను ఆవిష్కరించకపోతే అది రాణించదనే నా అభిప్రాయం. అయితే, అక్కడక్కడ భావకవితలు రాసినంత మాత్రాన సామాజిక ప్రయోజన లక్ష్యం, ఆశయం దెబ్బ తింటుందని నేను అనుకోను. యువతరాన్ని మేలుకొలపడానికి నా కలాన్ని, నా గళాన్ని వినియోగిస్తాను. అదే నా దీక్ష, ఆశ, ఆశయం.

డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావుగా రన్నట్లు "కవి కర్మ కావ్యం గనక, కవి వ్యక్తిత్వం కావ్యంలో ప్రతిబింబించడం సహజం. కవి సమాజంలో ఒక వ్యక్తి గనక, సమాజం అతనిమీద ప్రభావాన్ని చూపిస్తుంది. కవి సామాన్య వ్యక్తి కాదు గనక, సమాజంమీద తన వ్యక్తిత్వ ముద్ర వేస్తాడు. ఈ విధంగా కవీ, సమాజమూ కలిసిపోయినప్పుడే మనకు ఉత్తమ కవిత్వం లభిస్తుంది."

నిజమే! సమాజంమీద తన వ్యక్తిత్వముద్ర కవి వేస్తాడు కనుకనే ఆధునిక కవి ప్రగతికి స్వాగతం పలికి, క్రాంతికి శుభం పలికి, జనానికి సంక్రాంతులు ఆశిస్తున్నాడు.

వాస్తవికత పేరున కవిత కరపత్ర రచనగా, నినాదాల రచనగా మారి పోవడం అభ్యుదయ కవితోద్యమానికే తీరని లోటు. అలాటి ప్రమాదం నుంచి తప్పించి, వచన కవితా ప్రక్రియలో ఉత్తమ కవితాసృష్టి చేయగలం అని నిరూపించ డానికే తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' రాసినా, ఎల్లోరా 'రేపటి వసంతం' రాసినా.

సాహిత్య ప్రయోజనంమీదా, సాహిత్య ప్రభావంమీదా కొందరికి కొన్ని అపోహలు ఉన్నాయి, సమాజంమీద దాని ప్రభావం అంతగా ఉండదని. సాహిత్యోద్యమమే విప్లవాలను సాధించదు. సమాజం ఒక్కసారిగా మారిపోదు. సమాజంలో వచ్చే మార్పుకు సాహిత్యోద్యమంకూడా కొంత ఊతనిస్తుంది; ఊపిరి నిస్తుంది. ఇది మాత్రం నిజం.

నా కవితలో అభ్యుదయ కవిత్వం కొన్ని పాళ్లు, ప్రకృతి వర్ణనాత్మక భావ కవిత్వం కొంత కలిపిన మిశ్రమ సంప్రదాయం. నా ఆశయం అభ్యుదయ కవిత్వాన్ని కూడా అందంగా చెప్పాలనే.

ఆ మధ్య ఆత్మీయ మిత్రులు మా కుందుర్తి నా 'రేపటి వసంతం' చదివి ఓ మాట అన్నారు - "మీ కవితలో అభ్యుదయ కవితతోపాటు భావ కవితకూడా ఉంది. అది యువకులను ధ్యేయంనుంచి కాస్త మళ్ళించకుండా చూడాలి" అని.

తిలక్ ఏ ఆశయంతో కవితను రచించాడో, నేనూ అదే వరవడిలో ఆవిష్కరించాను, జీవన సంగీతంలో నిషేధం ఏదీ లేదనే నమ్మకంతో.

ఈనాడు ప్రాచీన సంప్రదాయ కవితకు, ఛందోబద్ధ కవితకు అంతగా ప్రజలలో పలుకుబడి లేదు.

జీవన సంగీతంలో అభ్యుదయ భావన ప్రగతి ప్రబోధంతోపాటు ప్రకృతి వర్ణనాత్మక భావచ్ఛందాలూ రావచ్చుననేవారూ ఉన్నారు. ఈ కోవకు తిలక్, నారాయణరెడ్డి, దాశరథి, ఎల్లోరా, శేషేంద్రశర్మ, అరిపిరాల విశ్వం మొదలయిన వారు వస్తారు.

ఆరుద్ర అన్నట్లు బాధ గుండెల్లోంచి వస్తే, వేదన మెదడులో పెరుగుతుంది. యువకవిత్వానికి గుండెలూ, మెదడూకూడా ఉన్నాయి. కొత్త సంకేతాలు, కొత్త సంగీతాలు, కొత్త ప్రతీకలు, కొత్త సంవిధానాలు - వేయి పువ్వులు విచ్చుకొన్నట్లు వచనపద్యం ఉద్యమంలాగా విడిగి విప్పారింది.

ఈనాడు మన దురదృష్టం కొలదీ కవిత్వంతో సంబంధం లేని, ఆధునిక కవిత అంటే కిట్టని పచ్చిపులుసుగాళ్ళకు, సామాన్యప్రజ నోళ్ళలో కమ్మగా మసిలే ప్రాంతీయ పదాలు సైతం విననివారికి వచన కవితా సంపుటాలు సమీక్షకు వెడుతున్నాయి. తగుదుమమ్మా అని 'కొబ్బరిచెట్టుకు టెంకాయచెట్టు అనవలయును' అంటూ విమర్శ రాసి పాపం, విమర్శకులమని చంక లెగరేస్తున్నారు. ఇటువంటి వారికి చక్కని సమాధానాలు ఇచ్చి నోరు మూయించినవారూ లేకపోలేదు. అంతేకాదు, మరి కొంతమంది సాహిత్య విమర్శకులమని కిరీటాలు తమకు తామే తగిలించుకొని గ్రంథంలోని భాష, భావం, ఇంపుసొంపులు చూడకుండా గతంలో కవులు వాడిన పదాలే వాడాడు, ఇలాటి పరాయి పదాలు వదిలి స్వంత పదాలు రాయాలి-అంటూ విమర్శ చేస్తారు. అభ్యుదయం, చల్లన, మందారం, క్రాంతి, విప్లవం - ఆధునిక కవితలో అందరూ వాడతారు. ఇదా విమర్శ? మన ఖర్మకు ఇలాటి పెద్దలు పెద్దలై కూర్చున్నారు.

ఎవరి కోసమో ఒకరిద్దరి కోసం కవి కవిత్వం రాయడు. సమాజం కోసం, జనం కోసం రాస్తాడు. ఆ జనం మెప్పు కావాలి కవికి.

నేను మొట్టమొదటిసారిగా 'రేపటి వసంతం' వచన కవితా సంపుటి రాశాను. జనంలో ఆ గ్రంథానికి మంచి ఆదరణ, సాహితీ లోకంలో మంచి ప్రోత్సాహం లభించాయి. ఇవే కవికి అక్షర లక్షలు.

నా దృష్టిలో వచన కవిత ప్రముఖ కవి శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ చెప్పినట్లు నలుగురి నోళ్ళలో ప్రతిధ్వనించాలి; 'హ్వా' అనిపించుకోవాలి.

అదే నా ఆశ, ఆశయం. అందుకోసమేనా తపస్సు.

గతంలో నా కవితా సంపుటి 'రేపటి వసంతా'న్ని ఆదరించి, ప్రోత్సహించి నట్లుగానే ఈ సంపుటి 'నిశ్శబ్ద తరంగాల'ను ఆదరించి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను.

'ఈ తరం నా తరం' అని గర్వంగా చెప్పుకొంటూ, నవతరం కోసం కవితా విపంచిని మీటుతున్నాను. వచన కవితా పతాకను ఉద్యమ కవితా పతాక సంకేతంగా ఆవిష్కరిస్తున్నాను.

63, వి. ఆర్. పిళ్ళై స్ట్రీట్,<br>మద్రాసు - 600 005.

— ఎల్లోరా<br>నల—ఉగాది

# అగ్ని నేత్రం

ఇది నా దేశం!
చీకటి రాక్షసి
కబంధ హస్తాలతో
గొంతు పిసికి
చంపెయ్యాలని చూస్తే
నేను కాలరుద్రుణ్ణి
ఇది నా దేశం!
ఫాసిస్టు దుష్టశక్తి
పన్నాగాల కుయుక్తులతో
జనాన్ని కాల్చుకు
తినెయ్యాలని చూస్తే
తెరుస్తాను
నా అగ్నినేత్రం!
రండి!
కలిపి తాగుదాం అమృతం!
పంచిపెడదాం శాంతిని ఆహ్వానిస్తూ
పదిమందికీ పంచామృతం!

# తెలుగు తల్లికి కవితాభిషేకం

ఒకనాడు నిఖిల జగతి
   నివాళు లందుకున్న జాతి మనది!
దానికి నీతి పునాది
దానికి ఉగాది ఆది!
అదే ఆంధ్ర సాహితీ భారతి
రమణీయార్థాల
పదబంధ పారిజాతాల
సుగంధ పరిమళ జీవనాడి!
మన జాతి చరిత్ర అది!
అది ప్రగతికి పునాది!
ఒకనాడు నిఖిల జగతి
నివాళు లందుకున్న జాతి మనది.

*   *

నా జాతి చరిత్ర
విరచిస్తాను సువర్ణాక్షరాలతో!
నా జాతి కథను వినిపిస్తాను
సప్త స్వర రస మధుర
మంజుల గానంతో!
గత వైభవ సాహితీ సముచ్చయాల
తోరణాల పందిళ్ళ నీడల్లో
గత వైభవ భాషా శేముషీ

కీర్తిపతాకాల రెపరెపలలో
నా జాతి జనులు ఆవిష్కరించి
అందలాలు ఎక్కించి
అంబారీలు ఊరేగించి
సన్మానాలు అందుకున్న
నా భాష తీయదనాన్ని
ఇంపుసొంపుల సుగంధ పరిమళాన్ని
మరోసారి వినిపిస్తాను!
మనసుల్లో ఆవిష్కరిస్తాను.

* * *

ప్రేమానురాగాల మంత్రాలతో
ప్రారంభం అయిన మహాంధ్ర
ఉగాది ఆశయాల ఆశలను
నిజం చేసి పండించడానికి
ప్రతిజ్ఞ చేయాలి నేడు!
అది నిలుపుకోవాలి
మరో వెయ్యేళ్ళు!!
ఆకలిని తరిమేసి
చీకటిని దునిమేసి
అవమానాల అసంతృప్తులకు
సమాధి కట్టి చరమగీతం పాడడానికి
నా తరానికి ఈ తరానికి
విరచిస్తా కొత్తచరిత!
సృష్టిస్తా స్వర్ణ చరిత!
తెలుగు అక్షరాల హృదయాల
అమృతభావనలకు చిహ్నంగా

వెన్నెల నృత్యం చేయిస్తా!
వెలుగును మీటి పాడిస్తా!!
అన్నదమ్ముల ప్రేమానురాగాల
తీయందనాల వృత్తాలతో
భాగ్యనగరాన్ని – మహేంద్రాన్ని
నవ్వించండి
ఆ నవ్వుల జల్లుల హాయి కెరటాలలో
జాతిని తేలియాడించండి!
తెలుగు గుండెను ఉప్పొంగించండి!

* * *

ఆంధ్రభాషకు రాయల కాలంలో—
పండితరాయల కాలంలో జరిగిన
సన్మాన సత్కారాలను తలచుకొని
తిరిగి తెలుగు భాషకు
పట్టాభిషేకం చేదాం—రండి!!
నా తెలుగు అక్షరాలు పంచాక్షరిలా,
వెలుగులా అన్ని మూలలా
పలకరించాలనీ
విరచిస్తాను కొత్తపాట!
అందరికీ నవోత్సాహం పంచేందుకు
అందరికీ ఈ ఉగాది చైత్రం
నవ ఉగాదికి పునాది అయ్యేందుకు!!
ఆవిష్కరిస్తాను కొత్త బాట!
అది నా జనం ప్రగతి
ప్రస్థానం సాగించేందుకు
కావాలి బంగారుబాట!

అది నా తరం
విజయానికి
ప్రతినోటా ప్రతినాటా
కావాలి కమ్మని పాట!

* * *

సమైక్యంగా ప్రగతి పథంలో
ప్రస్థానం సాగించాలని
నా జాతి నవ్యజగతి నిర్మాణానికి
మహోదయ శిల్పి కావాలని
అందుకు సత్యం శివం సుందరాలతో
ముందుకు—మునుముందుకు
సాగిపోవాలని ఆశిస్తూ
అక్షరాక్షతలు జల్లుతున్నాను!
సాహితీ ప్రవచనం చేస్తున్నాను!!
నా తెలుగు తల్లికి
మంగళారతులుగా
కవితామంజీర ధ్వనులతో
కవితాగానం చేస్తున్నాను!!

*

# నిశ్శబ్ద తరంగాలు

ఈ ప్రకృతి కొండంత చేసుకున్న
కళ్ళతో నవ్వుతూన్న శబ్దాల
తోరణాల కిరణాల ముఖాలలోని
నిశ్శబ్ద నిగూఢ క్రాంతిశబ్దం
వరదలా విరుచుకుపడడానికి గుర్తేమో?
ఈ గాలిలోని మూగతనం
ఒళ్ళంతా చల్లదనాన్ని
సుగంధాల పరిమళంగా మలచుకొని
గాలి తరగల కిరణాల ఆత్మలో
తొంగిచూస్తున్న నిశ్శబ్ద నిరాకారమూర్తి
రానున్న ప్రళయానికి పిలుపేమో?
నిశ్శబ్దంలో అగాధాల
దిగంతాల కావలి తీరాలలో
మౌనశబ్దాల పిలుపుల సవాళ్ళు
నిశ్శబ్ద తరంగాల భీకరాలు
పుడమితల్లి పురిటినొప్పుల
ఉచ్ఛ్వాస నిశ్వాసాలా!
ఉదయపు కనుబొమల రేఖల్లో
ప్రభాభాస్కరుని ప్రస్థాన కేతనమా?
ఉషఃకవాటం తెరుచుకొన్న
శబ్దతరంగాల సవ్వడులా?
క్రాంతిరథాల మహాప్రస్థాన
సంకేత కేతనాలా?
ఈ నిశ్శబ్ద తరంగాలమీద

ఈ విశ్శబ్ద కిరణాలమీద
నిలిచిన ఆశల గొంతు
ఆశయాల నీడల నీడల్లో
ఎదగాలి ఆకాశమంత!
అందుకోవాలి నక్షత్ర
కవితాగాన గోష్ఠి
శుభముహూర్తపు వేళకు!
విశ్శబ్ద తరంగాలు
నిజాల శబ్దాలను
వినిపించే చోటికి!!

*

# పుట్టిన రోజు

నీకు ఏం కొని పంపగలను, చెల్లీ!
  నీ పుట్టినరోజు తలుచుకొని
ఏమని మురిసిపోను?
కుర్రవాడు అమ్మా ఆకలని
డొక్కలో చేతులు పెట్టుకొని ఏడుస్తూంటే,
చిన్నదానికి 105 డిగ్రీల జ్వరంలో
డాక్టర్ రాసిన మెడిసిన్
బ్లాకులో కొనడానికి శక్తిలేని
అసమర్థత వెక్కిరిస్తూంటే,
మూడు రకాల పాతచీరల పీలికలు అతుక్కొని
మానాన్నీ, నాగరికతనీ దాచుకొనే
భార్యను చూసి కడుపు తరుక్కుపోతూంటే,
నీకు ఏం కొని పంపగలను, చెల్లీ!
నీ పుట్టిన రోజు తలుచుకొని
ఏమని మురిసిపోను?
ఉద్యోగంకోసం బి. ఎ. డిగ్రీ
పట్టుకుని దేశం నలుమూలలా
చెప్పులు అరిగేలా తిరిగిన
చిట్టితమ్ముడి జాబులోని
ప్రతి అక్షరం రక్తాశ్రువులు నింపుతూ,
నవభారతంలో విశ్వవిద్యాలయ
విద్యార్థికి పట్టంవల్ల లభించిన
నిరుద్యోగాన్ని తలుచుకొంటూ
నీకు ఏం పంపగలను, చెల్లీ!

నీ పుట్టినరోజు తలుచుకొని
ఏమని మురిసిపోను?
చూడు, చెల్లీ!
కష్టాలు అట్టేకాలం నిలవవనీ,
చీకటినుంచి వెలుగు ప్రభవిస్తుందనీ,
అరుణోదయం మనల్ని నవ్విస్తుందనీ
పుట్టినరోజు పెట్టి పుట్టినరోజులా
అందరికీ శుభాలు పంచుతుందనే,
నీ పుట్టిన రోజున 'ఆశ'ను
బంగిచేసి పంపుతున్నాను, చెల్లీ!
నీ పుట్టినరోజు కానుకగా
అన్న పంపిన ఈ బంగి విప్పి చూసుకో,
ఈ బంగిలోని నా ఆశల ఆశీస్సుల్ని
నీవు భద్రంగా దాచుకో!

# నా కవితకు....

నా కవితకు మూలం జనం!
నా కవితకు నేత్రం జగం!
ముళ్ళబాటలో మల్లెలు పూయించి
రాళ్ళనేలలో పంటను నవ్వించి
బండరాళ్ళలో గుండెలు పలికించి
బ్రతుకంతా జనంకోసం ధారపోసే
శ్రామికజాతి సమస్యలే నా కవిత!
నా కవితకు మూలం ఘర్మజలం
నా కవితకు ధనం ప్రజారథం!
కొండ దాటి, అడవి దాటి మార్గం లేకుండా
ప్రవహించే నదు లన్నిటికీ
మార్గాలను నిర్దేశిస్తూ
నీటికి బ్రతుకు మార్గం చూపే
కార్మికుల వేడి నిట్టూర్పులే నా కవిత!
ఆ కవితకు మూలం నా జనత!
నా కవితకు ప్రేరణ ప్రగతి!
ఈ కవితకు స్పందన జగతి!!

# కాస్త దిగండి

దిగండి కాస్త కిందికి!
జారకుండా,
దభీమని పడకుండా
కీళ్ళు విరక్కుండా
ఎముకలు నలక్కుండా
దిగండి కాస్త కిందికి!

* * *

ఎక్కినంత కాలం
ఎక్కారు పైకి
మెక్కినంత కాలం
మెక్కారు
ఇక పైకి మెట్లు లేవు
ఆపైన అందలాలు లేవు
దిగండి కాస్త కిందికి!

* * *

దినం గడవడమే
ఒక నరకంగా
అనుదినం బ్రతుకు
భయం భయంగా
బ్రతుకీడ్చే జనం మాట విని
దిగండి కాస్త కిందికి
దినాలు దగ్గర పడకుండా
దివిటీలు చుట్టుముట్టకుండా

నిన్నటిలా ఆలోచించకండి
నేటి గాలివాటు గుర్తించండి
చలిచీమల కన్నాలలో
నిన్న పాములు నివసించాయి
నేడు పాముల పుట్టల్లో
చీమలు నిదురిస్తాయి
కాలం మారింది, బాబులూ,
కాస్త దిగి రండి!

* * *

పుణ్యం మాట అటుంచి
నిప్పు మండకుండా
ఉన్నదాంట్లో సాటివాడికి
కాస్త చెయి దులపండి
కాలం మారింది, బాబులూ,
కాస్త దిగి రండి

* * *

దిగువనున్న జనంతో
మంచిగా తిరగండి
ఈ కవి ఆశించే భూతలస్వర్గం
ఈ రోజే నిజం చేద్దాం
కాస్త ఆలోచించండి!!

# కపోతాగమనం

నిశ్శబ్దం సింహాసనాన్ని అధిష్ఠించి
తన ఊహాచిత్రాల మౌనగానాలను
ఆలపిస్తూంది!
శాంతిని గుండెలో భద్రంగా దాచుకొని
దానికి రెక్కలచత్రంతో భద్రతను అల్లి
వర్తమానంలో భయంతో మౌనంగా
దుఃఖిస్తున్న విశ్వజనతను
శాంతిగీతంతో జోకొడుతూంది కపోతం!
ఆకాశం నిండా మౌనముద్రలో,
నేలమీది రాక్షసాలను చూడలేని
నక్షత్రకూటం మూతి ముడుచుకొని
ఉషస్సును ఆహ్వానిస్తూ,
"తమసోమా జ్యోతిర్గమయ" అని
క్రాంతికవాటాలను తడుతూంది!
నిశ్శబ్దం హృదయంలో
మౌనతరంగాలపై గాలిపడవల్లో
పయనిస్తూ ప్రేమామృతాల
పాలకడవలను ప్రేమసామ్రాజ్యానికి
చేరవేస్తున్నాయి!
నింగి అంతా పాలకడవల బారులా
మల్లెపూల రథాల పరుగుల్లా
మరో లోకానికి వెళ్ళే నీలిసంద్రంలా
అక్కడక్కడ మేఘాలు మల్లెపూల

రథాల పరుగుల్లా కనిపించి
ఆశల కుటీరంలో కోర్కెలు
రంగవల్లికలు వేస్తూంది!
నిశ్శబ్దం హృదయంలో ఆనంద కేతనం
ప్రేమాభిషేకోత్సవానికి
లయవిన్యాసం వినిపిస్తూంది!
నింగినీ, నేలనూ చూసుకుని
కపోతాగమనంలా ఓ నక్షత్రం నవ్వింది!
నువ్వూ, నేనూ కలిసిన మధురక్షణపు
జ్ఞాపకంలా
వెన్నెల విరబూసింది!!

*

# యుద్ధం

నాకూ యుద్ధం చేయాలని ఉంది!
    యుద్ధంలో సైనికుడిలా నిలవాలని ఉంది!
అధర్మంమీద, అన్యాయంమీద
అధికారంమీద, గుడ్డిచట్టంమీద
ఈర్ష్యమీద, ద్వేషంమీద
చీకటిమీద, స్వార్థంమీద
మోసంమీద, మతంమీద
ప్రాచీనతమీద, బూతుపురాణంమీద
పుక్కిటి పురాణాలమీద, అభూత కల్పనలమీద
యుద్ధం ప్రకటించాలని ఉంది!
యుద్ధభేరీ మ్రోగించాలని ఉంది!
దరిద్రంమీద, చీకటివ్యాపారంమీద,
రోగాలమీద, అధిక లాభాలమీద
కులవ్యవస్థ మీద, గుడ్డినమ్మకాలమీద
కత్తిపట్టి దూకాలని ఉంది!
కడకంటా దునుమాలని ఉంది!

❋

# మధురామృతం

ప్రతి చూపులో ఒక ప్రేమలేఖ
ప్రతి శ్వాసలో ఒక ఆహ్వానం
ప్రతి కదలికలో అనురాగాల మంజులగానం
ప్రతి నవ్వులో పూల పరిమళభరితం
ఆ సాయంత్రం ఆ గంభీర సంద్ర నీలిమలో
ఆ సాయంత్రం ఆ చల్లనిగాలి గుండెల
రాగమేళనం
ప్రతి పువ్వుల జడలో నువ్వులా ఒక నీడలా
అనిపించే జాడలా ఆ రోజు
ప్రతి రేకలో నీ కనురెప్పల సవ్వడిలా
గుసగుసల ఒరవడిలా ఆ రోజు
నీ చూపుల రాగాల లయవిన్యాస ప్రదర్శనంలో
చూపించిన మెలుకువల విశేషాల జోరు
ఆ రోజు – ఇసుకతిన్నెలమీద
జంటలు రాసుకుంటున్న
ప్రేమలేఖల రేఖలబారు
వింగిమీద ఏ ప్రియునికో సందేశం
పమిటలో దాచుకొని
గర్వంగా పయనిస్తున్న మేఘాలబారు
అలాటి జ్ఞాపకాన్ని జ్ఞాపకం చేస్తున్న
నీ బుగ్గల గుసగుసల తీరు
ఆ రోజు ఆ చల్లని సాయంత్రం
మందారంపు చీరలో ప్రేమ మందారంలా
నీ వయసు చేసిన అల్లరి

నా జీవితంలో చిగురించిన ఆనందవల్లరి!
నీ కనురెప్పలు రాసిన ప్రేమలేఖల
రేఖాచిత్రాల చయనికలో
నా అనురాగాల రేఖల చిత్రాలను
చిత్రించాలని అనుకొన్న సమయం
వెన్నెల వసంతాల జల్లుల్లో
ఇద్దరం తడవడమే ఒక జ్ఞాపకం
ఆ తడిపిన నీ వయసు హొయలు
చెప్పిన రహస్యాలే
నాకు మధురామృతం!!

*

# మానవ గీతం పాడుకొందాం—పద!

గతకాలపు సువర్ణ చరిత్ర చిట్టావర్జాల
కొన భూగర్భాన్ని పలుగు పదునులతో
మానవుడు పరిశోధిస్తున్నట్లు
మొన్నటి పచ్చచేల గాలికెరటాల
దోబూచుల సయ్యాటల్లో
కోర్కెల గోపురాలమీద ఎగరేసిన
మధువుల మానసోల్లాసాల
రాగమేళనపు అనుభూతులను
జ్ఞాపకం చేసుకుందాం—రా!
చీకటి దారాలను త్రెంపుకుంటూ
వెన్నెల తేనెలను జుర్రుకుంటూ
నెమలిపిట్ట పురి విప్పి ఎర్రకాలువ
కొబ్బరితోపుల్లో ఆశలకు రంగు లద్దినట్లు
దూరాల తీరాల గోదారి లంకల కావల
గుడిగోపురాల కొండల శిఖరాలపై
అప్పుడే అభ్యంగనం చేసిన
యువతి కురులను
సవరించుకుంటున్నట్లు
నగ్నంగా నర్తిస్తున్న
నీలిమేఘాల పరదాల వెనుక
సంపెంగల సరసాల రసాలను
గుండె గుడిలో ఆవిష్కరించుకొని
ఆరాధిద్దాం—రా!
ఆ మందిరంలో ఆనందంగా
మానవగీతం పాడుకొందాం—పద!

# ఆనందకేతనం

కడుపు నిండా నీళ్ళు త్రాగి
పొట్ట నిండా నీళ్ళు నింపుకుని
ఒళ్ళంతా పచ్చరంగు పూసుకుని
చల్లగాలి కెరటాలలో
ఉయ్యాల దంబాల ఆడుతూవచ్చే
పంటలచ్చి పయిటలో
దాగున్న అదృష్టాల గాదెలు
నింపడానికి నిర్మలంగా
బంతిపూల రయిక
పచ్చసుక్కల కోక కట్టుకుని
తెలుగు పడుచులా ఒయ్యారాలు చిలకరిస్తూ
వస్తున్న ధాన్యలక్ష్మి చూపుల్లో
అన్నపూర్ణ అభినయ హస్తముద్రలు!
"భవతీ భిక్షాందేహి" అన్న శివాష్టకం
విన్నంతగానే గాదెల్లో ఆనందనృత్యం
చేసే ధాన్యంగింజల్లారా?
మీరు ఉన్నవాళ్ళ గాదెల్లో బందీలు!
సామాన్యుడంటే మీకు అభిమానం
మీకు నీరు పోసి పెంచిన
రైతు అన్న అంటే అభిమానం - కాని,
ప్రస్తుతం మీరు పరాయివాడి
కండబలపు గాదెలో బందీలు!
నాకు తెలుసు!
మీరు సర్వమానవజాతిని
కులాల మతాల కతీతంగా

ప్రేమించే సమ సమాజవాదులని!
మీరు అందరికీ సమాన మిత్రులుగా
ఉండాలని ఆశలూ ఆశయాలూ పెంచుకొంటారు
అందుకే రైతన్ననీ, కూలన్ననీ చూపి
హాయిగా చేలలో స్వతంత్రంగా
నవ్వుతారు - ఆనందిస్తారు!
ఈ సమాజంలో స్వార్థం
ధాన్యంగాదెలచుట్టూ కంచెలా పహరా కాస్తున్నట్లు
మీరు సామాన్యులకు అందని అదృష్టంగా
బంధించబడ్డారు!
మీకూ రెక్కలు వచ్చి గూటిలో చిలుకల్లా
సామాన్యుల గుండె గాదుల్లోకి ఎగిరి రాగలిగితే,
దారిద్ర్యానికి స్వస్తివాచకం తప్పదు!
గుడిసెల్లో వెలుగులు నవ్వక తప్పదు!
అప్పుడు—
చిక్కిన గుండెల్లో అన్నం
పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారం గావిస్తుంది!
అప్పుడు వెన్నెలతో మానవుడు
తన ఇంటికి వెల్ల వేసుకొంటాడు!
అప్పుడు గుండెగాదెలో మానవతను పెంచుకొంటాడు!
కత్తుల వంతెనమీద పరుగు మాని
పూలబాటమీద స్వేచ్ఛావాయువులు పీలుస్తూ
ప్రగతి ప్రస్థానం చేస్తాడు!
తనను కాల్చిన స్వార్థాన్ని తెలుసుకొంటాడు!
స్వార్థంపై యుద్ధం ప్రకటిస్తాడు!
ఆనందకేతనాలను ఎగరేస్తాడు!

*

# శత్రునిబర్హణ దీక్షాయజ్ఞం

ఈ సమరం చీకటితో సమరం!
    నిన్ననే ముగిసిం దనుకొన్నాను
అందుకే ఆనందాన్ని వెలుగుల్లో
వెన్నెల పదునుల్లో నవ్వించా లనుకొన్నాను
ప్రగతికి నవతకు తోరణాళిగా
ప్రతి గడపా ఆనందజ్యోత్స్నావళిగా చూడాలని ఆశించాను!
అందుకోసం ఎదురుచూశాను!
ఈ సమరం చీకటితో సమరం
రాక్షసత్వంమీద మానవత్వం
యుద్ధం ప్రకటించి పంజా విప్పిన సమయం!
నిన్నటితో ముగిసిం దనుకొని
శత్రునిబర్హణ పరిసమాప్తిగా
ముత్యాల వెలుగుల దివ్వెలతో
కాంతికిరీటాన్ని ఆవిష్కరించా లనుకొన్నాను!
క్రాంతి గీతాన్ని వినిపించా లనుకొన్నాను!
చీకటి లేని వెలుగు నేలమీద
విజయోత్సవ సంకేతంగా
నవతా నికేతనాలు ఎగరేయా లనుకొన్నాను.
ఒక్కసారి ప్రస్తుతాన్ని తనివితీరా
పరిశీలించి పరికించి చూశాను!
చీకటి రక్కసి యముని మహిషపు గంటల కర్కశ ధ్వనిలా
తిమిర రాక్షసి మహిషాసుర విషదంష్ట్రిల విషజ్వాలలా,
ప్రతి మూలా ఏదోలా దాగే ఉందనీ,

అది వెలుగుని కాటేస్తూ మ్రింగేస్తూనే
ఉందనీ తెలుసుకొన్నాను.
ఈ సమరం ఆగలేదనీ!
ఈ తిమిరం చావలేదనీ
తెలుసుకొని మరింత ఆశతో
నవోత్సాహ సమరశక్తితో
శత్రుసమూల విచ్ఛేదానికి
తిమిరాన్ని నిష్పచ్ఛరం గావించడానికి
తిమిర నిర్మూలనానికి
శాంతియజ్ఞం ప్రారంభిస్తున్నాను!
అగ్నిసూక్తం ఆలపిస్తున్నాను!!

*

# ఉగాది కవితా కల్హారం!

ఈ రోజు ఉగాది అని అందరూ అంటూంటే
అవునేమో ననిపిస్తూంది.
అందరిలా ఉగాది జరుపుకోవాలనీ ఉంది.
ఉగాది ఊహలను ఆశతో
నెమరేసుకొందామని
మనసు ఆశ పడుతూంది!
ఈ రోజు ఉగాది అని అందరూ అంటూంటే
అవునేమో ననిపిస్తూంది!

* * *

గున్నమామిడి తోపునీ
వేపచిగురు పూతనీ
కలిమిలేములతో నిమిత్తం లేని
గడపల తోరణాలనీ
పసిహృదయాల గెంతుల్నీ
రెమ్మగుబురు కోయిల పాటనీ
చూస్తూంటే జ్ఞాపకం వస్తూంది
ఈ రోజు ఉగాది కాబోలు నని!
అందరూ అంటూంటే
అవునేమో ననిపిస్తూంది!

* * *

గున్నమామిడి పూత వగరులూ
వేపపూల చిరుచేదు నగవులూ
వయసుకు గంధాలు అద్దుతూంటే

మామిడాకుల పందిరి నీడల్లో
సరిగమల సన్నాయి వింటూంటే -
ఈ రోజు ఉగాది జ్ఞాపకం వచ్చి
ఉగాది ఊహలతో
ఉయ్యాల ఊగా లనిపిస్తూంది!
కాని!

"అమ్మా, బిచ్చం!
అయ్యా, ధర్మం!
గుప్పెడు మెతుకులు, తల్లీ,
అన్నపూర్ణమ్మ తల్లీ" అంటూ

ఓ అస్థిపంజరం గొంతు
తీస్తున్న కూనిరాగం వినిపించి
అయ్యో, పాపం అనిపించి -
ఇలాంటి పీనుగులు చావక
హోటళ్ళముందు, సభలముందు,
ఇంటిముందు నిలిచి
దయ్యాల్లా కనిపిస్తూంటే
కసరా లనిపిస్తూంది!
కాని -

పుణ్యంమీద ఆశతో
సత్తుదో, మారనిదో - ఏదో
ఓ మూడుపైసల బిళ్ళ నలుగురూ చూసి
నా ధర్మకార్యాన్ని గుర్తించేలా
వాడిమీద విసరా లనిపిస్తూంది!

ఉగాదిపూటకూడా కొత్తఉగాదినాడుకూడా
ఏ గుడిసెలోనో ఏ తూము గోడవారో
మూలుగుతూ ముక్కుతూ పడి ఉండక
ఆకలిపాట దరిద్ర నృత్యం చేస్తూంటే
ఒంటిమీద గొంగళి పురుగు పాకినట్లుగా ఉంటుంది.

రత్నగర్భ అని పేరొందిన అన్నపూర్ణ బిరుదాన్ని
అపకీర్తిపాలు చేస్తున్నా రనిపిస్తుంది.
పరాయివాళ్ళ నోళ్ళలో ఇంటిగుట్టు
తూర్పారబడుతున్నారని అనిపించి
కసరా లనిపిస్తుంది!
కాని___
ఉగాదినాడు అలాటి పని చేస్తే
వచ్చే పుణ్యం రాకుండా పోతుందేమోనని
భయం అనుమానాలను కలిగిస్తుంది.
కాని -

నాకు శ్రీనాథుడిలా
మందార మకరందాల
సీసాల కార్కులు ఓపెన్ చేసి

మధువులతో మనసారా విందు చేసి
కొత్త వత్సరానికి గుర్తుగా పచ్చడి వడ్డించి
ఆటవెలదిని అందరి మధ్యనా నిలిపి
నా దేశంలో నేటిని నృత్యం చేయించి
చూపించాలనీ ఉంటుంది!

* * *

పాతనీ, కొత్తనీ కలిపి
కదంబ రసవిన్యాసకేళీ రసబంధాన్ని
ఆనందభైరవిలో వినిపించి
చప్పట్లు కొట్టించుకోవాలనీ ఉంటుంది!

ఇంట్లో పసిపిల్లల ఆకలిని గురించి
ఆలోచిస్తూ చప్పట్లు కొట్టకుండా ఉన్న
ఉగాది శ్రోత నిశ్శబ్ద, నిస్తబ్ధతను
అవగాహన చేసుకోవాలని ఉంది!
ఈ రోజు ఉగాది అని అందరూ అంటూంటే

అవునేమో ననిపిస్తుంది!
రేడియోనిండా ఉగాదిని మాటల్లో
పాటల్లా ఈ పూట
తెలుగు కవులు పంచిపెడుతూంటే
అందులో పచ్చి నిజాల టపాసులు
ఎలా ప్రేలతాయో వినాలని ఉంది!

* * *

ఈ రోజు ధరల పట్టీలో
వివరాల పంక్తులు చదవాలని
ఆనందంగా ముందుకు వెడితే
"రాక్షసి" బ్రతుకుని భయపెడుతూంది
ఈ ఉగాది పేరు రాక్షస అని వింటూంటే
కట్టిన పచ్చతోరణం ఎండిపోయేలా ఉంది
జనం హడావిడి చూస్తూంటే
ఈ రోజు ఉగాది అని జ్ఞాపకం వస్తుంది!

* * *

తిండి లేక, పని లేక బ్రతుకు
కత్తిమీద పరుగెడుతూంటే
గత్యంతరం లేక
సీతలూ అనసూయలూ మానాన్ని
సంఘపరం చేయడం చూసి
కన్నీటితో రాక్షసిని స్నానంచేయించాలని ఉంది!

జాతీయం చేసిన బాంకుల్లో
దొరికినంతమట్టుకు అప్పు తీసుకుని
అసలుకే ఎగనామం పెట్టిన
దేశభక్తుల ఫొటోలు తీయించి
జేబుదొంగల ఫొటోలపక్కనే
బస్సుల్లో, రైళ్ళలో పెట్టించాలని ఉంది.

ముచ్చటయిన ఎన్నో పేర్లుండగా
'రాక్షస' నామాన్ని వరించిన
ఈ వత్సరంగారి టేస్ట్‌ని చూసి
ఏడ్వలేక నవ్వాలని ఉంది!

ఈ చీకటిరాత్రి గడచేదాకా కాస్త ఓపిక పట్టి
ఉదయంకోసం, కోడికూతకోసం
అరుణారుణభరిత ఆవిర్భావంకోసం
ఆశతో, సరికొత్త రాగంలో
ఉగాది పాట రాయాలని ఉంది!
అది కొత్త పునాదిమీద నిర్మాణమయ్యే
సరికొత్త సమ సామ్య ఉగాదికి
నాందీవాచకం కావాలని ఉంది!

పాత పునాదిని సమూలంగా పెకలించి
నవ ఉగాదికోసం వేసే కొత్త పునాదిలో
కళ్ళు కప్పి చోటు చేసుకోవడానికి
ప్రయత్నించే చెదపురుగులకు
ఉరిశిక్ష విధించాలని ఉంది,
చీడపురుగులను ఏరి పారవెయ్యాలని ఉంది!

* * *

నవోత్సాహంతో నవతామయ
జగతీ ప్రస్థానానికి ఈ ఉగాది
సంకేతం కావాలని ఉంది!
ఆ ప్రస్థానంలో నవకవుల కవితాగానంతో
నా కంఠాన్ని జోడించి
మహోదయానికి, నవోదయానికి
స్వాగతం పలకాలని ఉంది!
అందరిలా నాకూ ఉగాదిని

నిజమైన ఉగాదిలా చేసుకుని
షడ్రుచుల కొత్త పచ్చడి తిని
చిగురుల విందుల్లో బిజీగా ఉన్న
కోయిలమ్మ సన్నాయిపాట కచేరీ చేస్తుంటే
తెలుగు అక్షరాల విందులతో
సాహితీ సమారాధనం చేయాలని ఉంది,
అందుకు మీ అందరి సహకారం కావలసి ఉంది!

ఈ రోజు పూరిపాకల్లోని
రేషన్ బ్రతుకుల ముఖాల్లో
తెచ్చిపెట్టుకొన్న ఉగాది సంబరం
ముచ్చిబంగారపు వెర్రిమెరుపులా ఉంది!
మద్రాసునుంచి కారులో
రాత్రి బయలుదేరి వస్తుంటే - నిద్ర పట్టింది
కాని—

అంతలో కుదుపులు ఎక్కువ అయి
మెలకువ రాగా ఆంధ్రదేశంలో
కారు ప్రవేశించిందని తెలిపింది
"రాష్ట్ర''నని పిలిచి కాస్త బుద్ధిగా
జనంతో మంచిగా బ్రతికిన
పుష్కర మాసాలూ గౌరవంగా
ఉండమని చెప్పాలని ఉంది!
పేరు భయంగా ఉన్నా మనసు
మెత్తనేమో నన్న ఆశ గుండె లోతుల్లో
మిణుకు మిణుకు మంటూంది!
సామాన్యుడు ఉగాదినాడు సరదాగా
సాటివాడుగా మనగలిగితే
ఆ రోజు 'ఉగాది' అని చెప్పాలని ఉంది.

ఆ విజాన్ని ఉగాది కవితగా రాసి
పాడి వినిపించాలని ఉంది!

ఇంతమంది ముఖాల్లో వెలుగు కనిపిస్తుంటే
తెలుగుతనం ఇక్కడే కనిపిస్తుంది.
ఆ తెలుగులో వెలుగు పాట రాసి వినిపిస్తుంటే
కరతాళధ్వనులు ఆశీర్వదిస్తుంటే
రేపటి ఉగాదిమీద ఆశ చిగురిస్తుంది?
ఉదయించే ఉగాదికి సాటికవులతో కలిసి
కాస్త ముందరే చేరాలని ఉంది
ఇంతమందినీ చూస్తుంటే
అవునుకదూ!
పంచాంగంలో రాసినట్టు
ఈ రోజు ఉగాది అని జ్ఞాపకం వస్తుంది!
యుగారంభానికి ఉగాది
ప్రారంభం అంటుంది పంచాంగం!
నవయుగారంభానికి సరికొత్త పునాది
కావాలంటూంది యువకంఠం, నవఘంటం!!
తెలుగు కవితల పాలవెల్లిని
ముత్యాల ముక్తచ్ఛందాల హారాలతో
స్వచ్ఛంద కవితా మందారాలతో
ముద్దుగా అలంకరించుకొని
గర్వంగా ఈ ఉగాదిని
జరుపుకోవా లనిపిస్తుంది
తెలుగుజాతి సమైక్య ఉగాది ఉత్సవంలో
ఆనందనృత్యం కూచిపూడి ఫక్కీలో చేయాలని ఉంది!
ఇంద్రచాపం రంగులను లాక్కొచ్చి
తెలుగు ఉగాది వాకిట్లో
రంగురంగుల రంగవల్లికల
చిత్రకళా విన్యాసాన్ని
ప్రదర్శించాలని ఉంది!
ఏమైనా ఒక్క మాట—
నిక్కచ్చిగా చెప్పాల్సి ఉంది!

ఎన్ని ముగ్గులు పెట్టినా
కడుపులో ఆకలి పోదనీ,
మరెన్ని తోరణాలు కట్టినా
దరిద్రం తొలగిపోదనీ,
ఎన్ని తెల్లముగ్గులు తీర్చినా
అనుమానాల చీకటి చావదనీ-
అందుకే మనసు వాకిట
వెలుగు ముగ్గులు పెట్టుకోమనీ
ఆశ చిగురున సదాశయాల
తోరణాలు కట్టుకోమనీ
వచ్చిందు, పోయిందు
ఏం మాట్లాడినా
తెలుగుగడ్డ ఒక్కటేనని తెలుసుకోమనీ
కులమతాలు వేరైనా
పీల్చే గాలి ఒక్కటేననీ.
ఎన్ని రాజకీయాలు పరవళ్ళు తొక్కినా
శాంతి జయిస్తుందనీ
సమైక్యం ఉదయిస్తుందని
ప్రగతి పరిమళిస్తుందనీ
ఖచ్చితంగా చెప్పాలని ఉంది!
ఈ ఉగాదికి పంచాంగ శ్రవణంలా
ఈ కవి పలుకులు నిజం కావాలని
కోటి గొంతులు కలిపి కోరుకోమనీ
శతకోటి కంఠాలతో కలిసి పాడుకోమనీ
సవినయంగా విజ్ఞప్తి చేయాలని ఉంది!
సహృదయ హృదయంతో

ఉదయరాగం ఆలపించాలని ఉంది!
మహోదయగానం చేయాలని ఉంది!!
అఘమర్షణస్నానం ఆచరించి
సమైక్య సమభావ శాంతి యజ్ఞవాటికలో
మహోదయ గానం చేయాలని ఉంది!!
వికసించే నవోదయ ప్రకృతి
రమణీయ దృశ్యాన్ని
కొత్త ఉగాదినాటికైనా
చూడాలని ఉంది!!

*

# ప్రజాస్వామ్యంగారా.....

ప్రజాస్వామ్యంగారా, రండి
సర్వం జగన్నాథ యాత్ర
ముగించుకొని తిరిగొస్తున్నారా
రండి!
కాస్త అలసట తీర్చుకోండి!
అదేమిటి, అలా ఏదోలా
అదోలా కనిపిస్తున్నారు?
సమ సమాజంలో అందరినీ
సమంగా చూడ్డంలో
పాలూ నీళ్ళూ ఒకటే అయి
ప్రజాస్వామ్యంలో ధర్మాధర్మ
పరీక్షలో గణితశాస్త్రం తప్పినందుకా
ఆలోచనల సులోచనాలలోంచి
వీక్షిస్తున్నారు ప్రగతిని
తలుచుకుని చింతిస్తున్నారు!
ఏమిటి, మీ నుదుటిమీద
ఆ గాయం?
అదా! పాలుపోసి పెంచిన నాగరాజు
పడగ విప్పి కొట్టిన స్నేహానికి చిహ్నం అది
బొల్లిగద్దలూ, బొంతకాకులూ
తోడేళ్ళూ, నక్కలూ, పులులూ
ఒకటై సమైక్య సమారాధనలో
శాంతిపందిరిలో జొరబడి
బీభత్సం చేసి - భయాన్ని
కుమ్మరించి

విజయం అంటూ శ్మశానాన్ని
సస్యశ్యామలం అంటూ
అరుస్తూన్న సమయం ఇది!
భయపడకండి—
ప్రజాస్వామ్యంగారూ!
సత్యానికి దీర్ఘాయుష్షు
శాంతికి మృత్యువు లేదు
ప్రజల రక్తబలంతో
ప్రజాశక్తి కండబలంతో
ప్రగతి చలువపందిరి నీడలో
ప్రజాస్వామ్యంగారూ!
మీరు ధైర్యంగా ఉండండి
ప్రగతిని నిరోధించే
ఈ మందేహులకు
కాలం విధిస్తుంది శిక్ష
ఆ నాడు ఇలాతలంలో
హేమం పండి
గుండెల్లో హేమంతం నవ్వుతుంది!
గుడుల్లో శివం పలుకుతుంది!! ❋

# పెను నిద్దుర

శోతాబాల అన్యాయాల
  దురహంకారానికి అగ్ని ముట్టిస్తా
శతాబ్దాల పెనునిద్దుర
వదిలించేందుకు
మేలుకొలుపులు ఆలపిస్తా!
చీకటికి నిప్పంటించి
వెలుగుపందిళ్ళ నీడల్లో
నా జనానికి నవ్వు అందిస్తా!
కాలపు పాషాణ శిథిలాలలో
బందీ అయిన నాగరికతను త్రవ్వి తీసి
నవజగత్తు పునాదులు నిర్మిస్తా!
కొత్త దారిని వెతుక్కుంటూన్న యువతరానికి
నా కండ కరగించి అండగా
కొండలా నిలుస్తా!

❋

# శిల్పం!

అక్షరాలకు మాటలు నేర్పి పాటలు నేర్పి
ఆడిస్తాడు, పాడిస్తాడు,
పలికిస్తాడు అక్షరశిల్పి!
నల్లని రాలకు ముక్కలు చెక్కి
వెన్నలాంటి మనసు నిచ్చి
ఆ శిల్పంలో కళామతల్లిని
ఓ యని పలికిస్తాడు శిల్పి!
శిల్పం అంటూ ఉంటే
రాయి అయినా, రాత అయినా
మనసుని పలకరిస్తుంది!
మనిషిని వరిస్తుంది!!

*

# నిశ్శబ్ద రమణీయ ప్రకృతి

ఈ నిశ్శబ్ద రమణీయ ప్రకృతి
ఈ గభీర రమణీయ వనాలు
దాటుకుంటూ వెతుక్కుంటూ
కర్తవ్యాన్ని పాలించేందుకు
బాధ్యతలను నిర్వర్తించేందుకు
ఈ దూరాల రమణీయ వనాల తీరాలకు
చీకటి నా బాటలు కమ్మక ముందే
మనసు నిదురముసుగు కప్పక ముందే
చేయాలి ప్రయాణం ఎంతో దూరం!
చేరాలి నా ఆశల ఉదయతీరం!
ఈ నిశ్శబ్ద రమణీయ సుందర
స్వప్న విజయాల సరిహద్దుకు
ఈ నిశీధాలను దాటుకుంటూ
తమస్సును ఈదుకుంటూ
వెళ్ళాలి ఎంతో దూరం
చీకటి అడ్డకముందే
చేరాలి రేపటి ఉదయం!

❋

# వెలుగంతా ఒకటే

ఈ వెలుగు కిరణాలు తెలుగు నేలమీద
సమానంగా ప్రసరించనీ,
ఈ తెలుగు అక్షరాలు వెలుగులా
అన్ని మూలలా పలకరించనీ!
మండలం పేర, మాండలికం పేర
అమ్మ గుండెలో మంటలు రేపకు,
అమ్మ పాలు ఇద్దరం తాగాం,
అమ్మ ఆదరణలో ఇద్దరం పెరిగాం!
కృష్ణమ్మ, గోదారి మనవే నన్నాం,
నాగార్జునం చూసి ఇద్దరం మురిశాం!
స్వార్థాల చింతనిప్పులు
అధికార ప్రాంతీయ దురహంకార జ్వాలలు
కలిపి కట్టుకున్న పచ్చని తోరణాలనే
ఖగ్గున మండించాలని పన్నాగం పన్నాయి!
తాత్కాలికంగా అన్నదమ్ములం
అపార్థాల వేదికి గిజగిజలాడాం
నిజం నిలకడమీద తెలిశాక
అమ్మ ఒడిలో ఇద్దరం వాలి
అమ్మ కన్నీటిని తుడిచాం!
విడిపోతున్నా మేమోనని
గుండె బాదుకొన్న అమ్మ

రక్తాశ్రువులు రాల్చిన అమ్మ-
ఇద్దరం ఏకమై 'అమ్మా' అని
పిలువగానే ఎంత మురిసిపోయింది!
ఎంత సంబరపడింది!
తెలుగుకి వాటాలు ఏమిటి?
వెలుగుకి హక్కులు ఏమిటి?
ఈ గాలి మనది!
ఈ నీరు మనది!
ఈ భూమి మనది!
మనమధ్య సఖ్యత
కలకాలం పదిలంగా ఉంటే
భవిష్యత్తు మనది!

✻

# నీవు జాబు రాయవు

నీవు జాబు రాయవు!
నా పిలుపు నీకు వినిపించదు!!
సుదూరాల తీరాల గాలికెరటాల
ఉయ్యాల ఆటల తోటల్లో
సుమధుర రాగాల రాగవల్లరుల మత్తులో
ఆడుతూ పాడుతూ గులాబీల
రెక్కలమీద కనురెప్పలమీద
గుండెమండువా మధ్యలో
గుర్తుల్లా కనుగుడ్లు కొంటెచూపుల్లా
గోరింట రంగుల గమ్మత్తుల్లా
ఆనందారామాల కొసల అంచుల్లో
అందని అందానివిగా నా ఆరాధనాదేవివిగా
అలా అలా దూరదూరంగా అలలమీది
కలువల్లా నవయౌవన కోర్కెల గుసగుసల్లా
గున్నమామిడి తోపుల్లో వేపచిగురు చేదుల్లో
మల్లెపూల పరిమళాల విందుల్లో
ఆశల అంచుల జరీజామారు మెరుపుల్లో
కోకిలమ్మ గొంతులోని లయ
విన్యాసపు హొయల్లో
వెతికి వెతికి కాలపురేఖ అంచువరకూ
పరువెత్తి చూస్తాను ఆశతో — నీకై
నీ గొంతు మండువాలో
నీ కోర్కెల గుర్తుల రంగవల్లులను తీర్చి దిద్ది
కలశం అమర్చి కల్హారాల కదంబాలతో
కట్టిన ఉయ్యాలలో జంటగా
ఈ వేళైనా ఉయ్యాల దంబాల ఆడాలనీ—
వెలుతురు కిరణాల దారాల రథాలపై ఎక్కి
ప్రేమగీతాలు పాడాలనీ....

*

# ప్రగతికి శ్రీరామరక్ష

ఇది సంక్రాంతి సమయం!
ప్రత్యూష పవనాంకురాలతో
గృహ ప్రాంగణాలను అలంకరించండి!
వెన్నెల వసంతంతో
ఇంటిగోడలకు వెల్ల వేయండి.
ఇంద్రచాపం రంగులను సమీకరించి
రంగవల్లికలను తీర్చిదిద్దండి!
రైతురాజుల ఘర్మజలానికి
ఖరీదుకట్టే వరికంకుల నవ్వులకు
హారతులు పట్టండి!

* * *

లోకాన్ని మేలుకొలిపే కోడిపుంజుల
కాలికి కత్తి కట్టండి!
తెలుగుజాతి పౌరుషాన్ని
అవి చిందించే రక్తంలో పరికించండి!
చచ్చినవాటిని పులావుగా మార్చి
అయినవాళ్ళకు విందులు చేయండి!
బ్రతికిన కోడి 'నా'దని మీసం మెలివేసి
నెత్తినెట్టుకుని ఊరేగండి!
కాస్తసేపు కోడిపందెం
ఎటువంటి ద్వేషాగ్నిని మనుషుల్లో రగిల్చిందో
గత చరిత్రను నెమరేసుకోండి!

తెలుగు వాడల పల్లె పడుచుల జడల్లో
మల్లెల దరహాసాలకు
బంతిపూల పాన్పులు వేయండి!
సంక్రాంతి సంబరాల అంబరాన్ని
అందుకొనే ప్రభలలా
జీవితాన్ని కొత్తగా మలచుకొని
ఎత్తుగా ఎదగండి!
తెలుగుదేశంలో క్రాంతిపూలు
వికసించే తరుణంలో
శాంతిశంఖాలు పూరించండి!
విజయఘంటలు మ్రోగించండి!
సంక్రాంతి శుభవేళ కానుకగా
కవితకు స్వాతంత్ర్యం ప్రసాదించండి!
తెలుగువీధుల్లో రక్తపుమరకల
జ్ఞాపకాలను చెరిపేయండి!
గడప గడపనీ సంక్రాతిలా నవ్వించండి!
ఆ నవ్వులనే దేశ ప్రగతికి
శ్రీరామరక్షగా సువర్ణీకరించండి! ❋

# విప్లవనాదం

ఈ వెలుగు మిగిలి ఉన్న తమస్సుని
హతమార్చేయాలనీ,
ఈ ఎరుపు వేయి దివ్వెలై
శతసహస్ర జ్వాలాముఖుల్ని
సృష్టించాలనీ,
ఈ వెలుగు ఉషశ్చరణాలకు
రక్తాంచిత పారాణి కావాలని,
ఈ వెలుగు సమర సేనావాహిని
ప్రస్థాన సంకేతం కావాలని,
ఈ నవంబరు విప్లవదినాన ఆశిస్తున్నాను!
అందుకై అక్షరాల పదును కత్తుల
క్రాంతిపతాకను ఎగరేస్తున్నాను!
సమసమాజ బీజాక్షర పఠనంతో
ప్రతిజ్ఞ చేస్తున్నాను!
ఇది నేటి యువతరం
అవజ్ఞగా భావిస్తున్నాను!
ప్రజలను క్రాంతిగీతంతో
మేలుకొలుపుతున్నాను.

* * *

ఈ రోజు!
దౌర్జన్యాన్ని హతమార్చిన రోజు.
ఈ రోజు!
జనశక్తి మేలుకొన్న రోజు!

ఈ రోజు!
ప్రజాశక్తి గర్జించిన రోజు,
అధికారాన్ని నిర్జించిన రోజు!
ఈ రోజు!
విప్లవాత్మ వినదించిన రోజు.
ఈ రోజు
రక్తారుణ పతాక రెపరెపలాడిన రోజు!

* * *

ఈ రోజు!
అగ్నిలా రాజుకోవాలనీ,
జ్వాలాతోరణాలతో
విప్లవ ప్రస్థానం సాగాలనీ
ఆశను వెలిగిస్తున్నాను!
అధికారాన్నీ దౌర్జన్యాన్నీ
అహంకారాన్నీ
ఈ మంటలు మ్రింగేయాలనీ,
పీడిత తాడిత జనమంతా
ఈ పండుగ శుభదినాన
నవంబరు విప్లవ దినాన
ఏకమై మునుముందుకు
సాగిపోవాలనీ,
ఆ ఆశయ సాఫల్యానికి
క్రాంతికేతనాల రెపరెపల్లో
జగమంతా, జనమంతా
ప్రస్థానం సాగించాలనీ కోరుతూ,

ఆశతో వెలిగిస్తున్నాను
అరుణారుణ జ్వాలాముఖిని!
పలికిస్తున్నాను
విప్లవనాద ధ్వని
తరంగాల విపంచిని!

*

# చెమట బిందువు

కవితా మంజీర ధ్వనితరంగాలమీద
  పయనిస్తా రేపటి ఉదయార్క
ప్రభాసదస్సుకు!
కవిగా వినిపిస్తా వెన్నెల తామ్రపత్ర
శాసనాన్ని ప్రతి హృదయానికీ
అమృత భావనా ప్రబోధాన్ని!
చీకటి దయ్యాలకు రాజకీయ కయ్యాలకు
మరణ శాసనం విరచిస్తా,
వెలుగు రథంమీద తెలుగు జాతిని
ఎక్కించుకుని ప్రగతి ప్రస్థానం సాగిస్తా!
విశ్వమానవ సహృదయ సంకేతంగా
చెమట బిందువులలోంచి ఆత్మశక్తిని రగిలించి
రక్తపు చుక్కలలోంచి
సమతా గీతం వినిపిస్తా!

# గడ్డిపూలు

ఎవరినీ నీళ్ళు అడగరు
 ఎవరినీ ఆహారం అడగరు
ఎండ వానలకు దడవరు
పూవుల్లో పూవులై నవ్వుతారు!
నిర్భయంగా నిలుస్తారు!
మాకన్నా మీరే నయమనిపిస్తారు
ఇనపవేళ్ళు కలుపుమొక్కలని
మీ పీక పట్టి నులిమేస్తుంటే
నిరాయుధుల్లా తల వంచుతారు!
వీలు చూసి తల ఎత్తుతారు!

❋

# నన్నిలా బ్రతకనివ్వండి!

మనిషిని ప్రేమించడం
    మనసుని వరించడం
మంచిని ఆదరించడం
నిజాన్ని బహిరంగంగా చెప్పడంమాత్రమే
నాకు తెలుసు!

మాట్లాడేది ఒకటి
చెప్పేది మరొకటి
చేసేది ఇంకొకటి
నాకు చేతకాదు.
నేను రాజకీయాల చెడుగుడు ఆట
ఆడలేను
లేనిదాన్ని ఊహించుకుని మోసపోలేను!
నన్నిలా బ్రతకనివ్వండి!

* * *

అక్షరాలతో ఆడుకొంటూ
పూలబాసలతో మాట్లాడుకొంటూ
మేఘాల రంగులరాట్నంమీద
మనసున్న మనుషులతో
చేతులు కలిపి ఆడుకోవడమే
నాకు తెలుసు
నన్నిలా బ్రతకనివ్వండి!

కాకాలు పట్టడం నాకు తెలియదు
లేనిదాన్ని ఉన్నదానిలా
బాకా లూదడం చేతకానివాణ్ణి
సాటిమనిషిని అవసరానికి
అందల మెక్కించి త్రోసేయలేనివాణ్ణి
న న్నిలా బ్రతకనివ్వండి!

* * *

నా స్నేహితులు అక్షర
అక్షయవాహిని!
నా స్నేహితుల చిరునగవుల
చిద్విలాసాల
అరుణార్క కిరణ కోటి
ప్రభాపుంజాలు!
నా స్నేహితులు కోటాను
కోట్ల విడిచిన పూవుల ఆత్మలు,
నేను మనసున్న మానవుణ్ణి
మంచిని ప్రేమించే సాటివాణ్ణి!
న న్నిలా బ్రతకనివ్వండి!

* * *

తాత్కాలిక కీ ర్తిపతాకాల
నీడల్లో గుడిపూడి జంగాల
శంఖాలు వినిపించలేను
అవసరానికి సాటివాడి జీవితాన్ని
నిచ్చెన చేసుకుని పైకి అధిరోహించలేను
అధికారం కళ్ళెర్రజేస్తే

అయ్యో, క్షణాభోగి పాపం
అని జాలిపడేవాణ్ణి
నన్నిలా బ్రతకనివ్వండి!

* * *

అందరం కొద్దో గొప్పో తేడాలో
చావడం నిజమన్న సత్యాన్ని
తెలిసినవాణ్ణి
పుట్టినప్పుడే మృత్యు
ముహూర్తం పెట్టారన్న
ధర్మం తెలిసినవాణ్ణి
నన్నిలా బ్రతకనివ్వండి!

* * *

పదవులు తాత్కాలికం
డబ్బు అశాశ్వతం
మోసం ఆత్మద్రోహం
సత్యం శివం సుందరం
నా రక్తంలో జీర్ణించిన
పంచభూత పరమోపదేశ
వేదాక్షర గాయత్రీ సందేశాలు!
వెలుగునుంచి చీకటిలోకి
మీరంతా వెడుతున్నారు
అది తప్పని అంటే
నన్ను తూలనాడుతున్నారు
నిజం నిలకడగా తెలుస్తుంది
చీకటినుంచి వెలుగుకి

నాతో రావడం గుర్తించే
రోజు దగ్గరలో ఉంది!
రేపుమీద నమ్మకం ఉన్నవాణ్ణి
ప్రగతి చేరువలో ఉందని
ఆశించేవాణ్ణి
మీలాంటి మనిషిని
మీలో నేనూ ఒకడిని
అనుమానాల నీడల దయ్యాలను
చూపి అనుమానాల
సహారాలో పయనించకండి
నమ్మకాల అమృతస్నేహ
సాగరంలో వెన్నెల పడవలలో
పయనించేందుకు
నాతో కలిసి రండి!
అందరం కలిసి స్నేహ
వారధిని నిర్మించుకొందాం!
అందరికీ లభించే స్వర్గాన్ని
సాధించేందుకు ప్రస్థానం సాగిద్దాం!
న న్నర్థం చేసుకోండి
నా పాట గొంతులోని
ఆనందభైరవిని ఆలకించండి!
న న్నిలా బ్రతకనివ్వండి!

*

# రసవాది!

పిడికెడు గుండెలో
  విశ్వమానవ చరిత్రను
విరచించి భద్రపరుచుకొన్న
పూర్ణ చరిత్ర ఇది!
ఒక్క పంక్తిలో
ప్రపంచ మానవాళి ఆశయాలను
నినదించి వినిపించిన
సమతాగ్ర కేతనం ఇది!
పాల్ రాబ్సన్ సంగీతాన్నీ
కాళిదాసు మేఘ సందేశాన్నీ
సమానంగా హృదయంలో రాసుకుని
పచ్చికలమీద పిట్టలబారు
ఆటలతో జోడు కలిపి
నా కోర్కెలను ఎగరేస్తున్న
ఆనంద రసవాదిని!
సమసమాజవాదిని!!

*

# మంటల జండాలు

త్రికాలాగ్నులు మండిస్తూ
జ్వాలలు రగిలిస్తూ
సూర్యుణ్ణి చిహ్నంగా
జెండాలు ఎగరేస్తూ,
జెండాల సూర్యుల్ని పుట్టిస్తూ
ప్రళయాగ్నులు సృష్టిస్తా!

* * *

ఆకలి జ్వాలలతో
నిరాశల మంటలతో
హాహాకారం చేసే
జనవాహిని ప్రస్థానానికి సంకేతంగా
గుండెలోని మంటల సూర్యుణ్ణి
కండలోని రక్తం రంగుల్ని
రంగరించి ఎగరేస్తా
పీడిత తాడిత
జనసందోహానికి
అండగా, కండగా
ఈ జెండాను!

* * *

ఈ జెండా నిజాన్ని
నిప్పులా మండిస్తుంది!
ఆ మంటల్లో అన్యాయాన్ని
బూడిద చేస్తుంది!

ఈ నిప్పుల జెండా నీడలో
వెలుతుర్ని మాట్లాడిస్తాను!
ఈ జ్వాలల జెండాలో
మానవతను పలికిస్తాను!
మనిషిని బ్రతికిస్తాను!

# చరిత్ర

కాలపు ముళ్ళకంపపై
  ఆరేసిన జరీపంచ జీవితం!
అది తీర్చి దిద్దుకోవడంలో తొందరపడితే
ముళ్ళ వాడికి చిరిగిపోయే
పంచవంటిది జాతకం!
ఎండిన ఆకులు రాలడం
వయసు ధర్మం!
పచ్చి ఆకులు రాలడం అధర్మం!
కాలం వేసిన రస్తాపై
నడుస్తూ సాగేది చరిత్ర!
ఆ చరిత్రను అలంకరించేది
కాలపు గాలివానలకు
తట్టుకొని విరచించేవాడు - మానవుడు
అలా సాగే ప్రస్థానంలో
చరిత్ర జరుగుతూంటుంది
చరిత్ర మారుతూంటుంది
చరిత్ర పుడుతూంటుంది!
కాని, కాలప్రవాహపు ఆటుపోటులకు
తట్టుకోగల చరిత్రకు
ఆయుష్షు ఉంటుంది.
అది సృష్టించినవాడికి
ఉషస్సు ఉంటుంది!
అది చిరక్కుండా
ముళ్ళకంపనుంచి
తీసుకొన్న జరీపంచలా
మెరుస్తుంది!

*

# దీపాన్ని

నేను మానవుణ్ణి
 అకుంఠిత దీక్షాదక్షతలతో
ప్రాచీన భారత చరిత్రను
విరచించుకొన్న ఆదిమానవుణ్ణి
నా చరిత్ర ప్రాచీనమైనది
నా యాత్ర మహత్తరమైనది
గంగా కావేరి గోదావరుల కలయికగా,
త్రివేణీ సంగమంలా
నా భావం సమైక్యత!
నేను భారతీయాత్మకు
ప్రతిబింబాన్ని
వేల వత్సరాల చరిత్రకు
సంకేతంలా నిలిచిన రూపాన్ని
రేపటి చరిత్ర ప్రస్థానానికి
వెలుగు చూపే దీపాన్ని!

# వెండిమబ్బు

దారి పొడుగునా వెన్నెల జ్ఞాపకాల
తలంబ్రాలు జల్లుకుంటూ,
మజిలీ మజిలీకీ క్రాంతిచిహ్నాలు ఆవిష్కరించుకొంటూ,
దశాబ్దాలు గడిచినా, యోజనాలు కరిగినా
వయసు అరిగినా పెరిగిన ఆశతో
మొక్కవోని ఆశయాన్ని గుండెల్లో
సూర్యుడిలా వెలిగించుకొంటూ,
కపోతాల చెవుల్లో ప్రేమలేఖలు చెప్పి
ఎగరేసుకుంటూ, నెమరేసుకుంటూ
పరుగెత్తుకొస్తున్నా!
నీడలో నీడలా కళ్ళలో కనుగుడ్డులా
కనిపించే నీ జాడల కోసం
ఆకులో ఆకులా, పూవులో తావిలా
కనిపించే నీ రూపం కోసం
పరుగెత్తుకొస్తున్నా!
పాత స్మృతుల సువర్ణ భాండాలను
పాతరలోంచి త్రవ్వి తీసుకోవడానికి,
మధుర స్మృతుల బృందావనంలో
వసంతోత్సవ కేళీనృత్యాలు చేయడానికి
అలోలక్ష్మణుల చూపుల లోతుల్లో
సుఖసౌఖ్యాల ఆనందార్ణవాలు
పండించడానికి,
నల్లమబ్బు బూకరింపుల ఆట కట్టించి

వెండిమబ్బుల విమానాల రెక్కలపై
జనాన్ని ప్రగతి ప్రస్థాన యాత్రకు
సన్నద్ధం గావించడానికి
పరుగెత్తుకొస్తున్నా !

# సుముహూర్తం

ఆగు - కొంచెం ఆలోచించు
గతం మండువా లోగిళ్ళలో ఆరగించిన
నేతుల గురించి కాదు,
గత వైభవ శేముషీ వైభవాల
పచ్చీసు ఆటగురించి కాదు,
గతంలో వీధి భారతాల
చుక్కల వన్నె చిన్నెల వగర్లు కాదు,
నేటి తరంలో వీస్తున్న గాలి గురించి—
నేటి అవసరాల జడివాన గురించి.
నేటి జనం ఆశించే
ప్రగతిని గురించి
ఉషోదయం అయిందని
సన్నాయి వినిపించే
సుముహూర్తం గురించి!

❋

# అగ్నిజ్వాలాతోరణాలు

పనిచెయ్యడం మానివేసిన వయసు చెల్లిన
   పాతయంత్రాల నట్టుల తుప్పు వదిలించడానికి
మట్టితో పూడుకుపోయిన ఏటికాలువలలో
మెరకలు త్రవ్వించి నీటిని పారించడానికి,
సుష్ఠుగా తిని మస్తుగా పైళ్ళలో గుర్రుపట్టి
నిద్రపోయే అధికారుల అనారోగ్యానికి
మందు కనిపెట్టి వైద్యం మొదలెట్టడానికి
చదువుకోసం అని చెప్పి చిన్నారి జడలతో
నడకలతో జులుంచేసే రోడ్డురోమియోల
మెదడుకు షాక్ ట్రీట్ మెంటు చేయించడానికి
చదువూ సంధ్యా లేకుండా, ఆస్తీ పాస్తీ లేకుండా
లక్షలు సంపాదించి అధికారాన్ని
ఒంటికాలిమీద ఏలుతూన్న
చీకటిప్రభువుల భరతం పట్టి
భరతవాక్యం పలికించడానికి
సత్యం చేతిలో త్రిశూలం నిలపాలి!
అసత్యం కళ్ళలో కారం కొట్టాలి!
శ్రమతో, చెమటతో, బాధ్యతతో
బీడులను పచ్చని బంగారు పొలాలుగా
తీర్చిదిద్దే కార్మికుని శక్తికి హారతిపట్టే
సమాజాన్ని ఆహ్వానించడానికి,
లేనివాడి అర్భకత్వాన్ని అలుసుగా తీసుకుని
పల్లకీలో కూర్చుని మోయించుకొనేవారికీ
తిండిని దాచి దారిద్ర్యాన్ని పెంచి

దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే
వినాయకుల బొజ్జలు కరగించడానికి
అగ్నిజ్వాలా తోరణాలు ఆవిష్కరించాలి !
ఆకలిజ్వాలను సమూల నాశనం చేయాలి !!

*

# కోటి కాగడాలు

నరకాసురుడు తారకాసురుడు ఉన్నారో లేదో నాకు తెలియదు
దేవదానవ యుద్ధం జరిగిందో లేదో నాకు తెలియదు
మోహిని అమృతం పంచిందో లేదో నాకు తెలియదు
రావణుడు సీతను గౌరవించాడో లేదో నాకు తెలియదు
భారతయుద్ధం నిజానిజాలు నాకు తెలియవు
కృష్ణుని పేర జరిగిన రాధామాధవీయాలు నాకు తెలియవు!
కాని— నేడు
నవప్రపంచ ప్రస్థానపథానికి అడ్డు వచ్చే నరరూప
నరకాసురులను చూస్తున్నా
పట్టపగలు అమాయక స్త్రీలను
ఎత్తుకుపోతున్న రావణబ్రహ్మలను చూస్తున్నా!
ఇరవైయో శతాబ్దంలోకూడా గృహిణులని
మోసగించడానికి పురాణాలలో ఋషులలాగ
మాయవేషాలు వేయడం చూస్తున్నా!
గుండెలోని చీకటిగదుల్లో మనసుని దాచుకొని
కూపస్థ మండూకాల్లా బ్రతుకుతున్న
మానవులను చూస్తున్నా!
దీపావళిపేర మతాబులు వెలిగించి
క్షణంమాత్రం ప్రత్యక్షమయ్యే
వెలుగును చూపి మోసపోతున్న సామాన్యుని
సాటివాడిని చూపి జాలిపడుతున్నా!
జనంలో మనంలాగ మనలో మనిషిలాగ
నటిస్తున్న నరరూపరాక్షస సంహారానికి
కొత్త దీపావళి చేసే నవ నరకచతుర్దశికి
క్షణాలు కూర్చి శుభక్షణాలు ఆవిష్కరించి

మనిషిలోని తమస్సును మానవునిలోని
క్రాంతిచ్ఛటలతో భస్మీపటలం చేసేందుకు వెలిగిస్తున్నా
సమతా దీపాలను
నవతా దీపాలను
కోటి కాగడాల వెలుగుతో
శతకోటి కాగడాల కాంతితో!

*

# పరిణామాల పరివర్తనం

పరిణామాల పరివర్తనంలో సంధ్యాకాంత
  కళ్ళు నులుముకొన్న క్షణంలో,
ఆలోచనలు నడిబజారులో
పగటివేషం వేసుకొని వీథినాటకాల ప్రదర్శనానికి
అమాయకుల్ని ఆహ్వానిస్తున్న సమయం.
రిటైరయిన ఉద్యోగి చెక్కు మార్చుకుని,
బస్సులో ఎక్కి లబోదిబోమని
ఉత్తి సంచీతో ఇల్లు చేరిన క్షణం,
కిచకిచలాడుతూ ఆడుకుంటున్న పిచుకని
బొంతకాకి ఇనుపముక్కుతో పట్టుకువి
పాపిష్టి బలంతో ఎగరేసుకొని పోయినవేళ.
పరాయిదాని కనుగీట్ల గాలంలో చిక్కి
లిక్కర్ల మత్తులో బందీ అయి
కట్టుకున్నదాన్ని బయటకు పొమ్మని
తలుపులు మూసేసిన భయంకర క్షణం!
పడుచుకుర్రాడి తియ్యని కబుర్లలో
డ్యూయెట్‌లు పాడిన యువతి
కడుపులో మరో పిండం గండంలా
కెలుకుతూన్న సమయంలో
ఊరు చివర బావిలో దభేలుమన్న శబ్దం!
పరిణామాల పరివర్తనంలో
ప్రస్తుతం మనిషిని ప్రశ్నిస్తూంది,
రేపటిలోకి తొంగి చూపి నేడు కలగవి,

నిన్నటి అనుభవాల పునాదిపై
రేపటి సౌధానికి బ్లూప్రింటు సిద్ధం చేయమని!
వెన్నెల స్వప్నానికి
ఉషోదయగీతం పాడమని!

# రోడ్డు

ఈ రోడ్డు మంచిదే
నువ్వు గమ్యానికి తప్పక చేరగలవు.
ఈ రోడ్డు కొత్తదే
అడ్డంగా నడిస్తే చేరలేవు!
ఇది అందరికీ ఒకలాగే కనిపిస్తుంది
అందరినీ ఒకలాగే చూస్తుంది
బ్రతికున్నవాడు నడిచినా
శవాల సవారీలు వెళ్ళినా
ఉలకదు ఈ రోడ్డు.
ఈ రోడ్డు మంచిదే!
నువ్వు సరిగా నడు
తిన్నగా నడు
అడ్డంగా నడవకు
పక్కదారులు పట్టకు
ఆశయంతో తల ఎత్తి నడు!
గమ్యానికి గర్వంగా చేరు!

*

# లే! రా! నడు! ఆగు

లే!
పదిమందికోసం
ప్రాణాన్ని ఒడ్డు!
రా!
జనాన్ని ప్రగతికి
నడిపించేందుకు నడు!
శేషు అనే ఆశ చిగురించే
ప్రస్థానం అందించు!
ఆగు!
ఆశ ఫలించాక!
అది నిజ మనిపించాక!

*

# కొత్త పాఠాలు

ఈ విద్య బ్రతుక్కి
పాఠం నేర్పదు!
ఈ విద్య మనిషిని
బ్రతికించదు!
కానైతే గానుగెద్దులా
బ్రతకడం నేర్పుతుంది.
కామందు దయకింద
చీమలా నలిగి ఉండమంటుంది!
ఈ విద్య గుమాస్తాల ఫాక్టరీ!
ఈ విద్య మూఢనమ్మకాల పేరడీ!
మనసుకి పాఠాలు నేర్పే
కొత్త సిలబస్ రాయాలి!
మనిషి బ్రతుకులో ప్రగతి
పరిమళం ప్రభవించాలి!

*

# ఆకు చిగురిస్తుంది

ఆకు రాలినా ఆకు చిగురిస్తుంది!
  చీకటి భయపెట్టినా
ఉదయం ఉన్నానంటుంది!
జనశక్తి ప్రస్తుతం ఓడినా
ఆఖరి విజయం సాధిస్తుంది!
ఆకు రాలినా తిరిగి ఆకు చిగురేస్తుంది!
నక్షత్రాలు రాలుతున్నా
నక్షత్రాలు తరగవు.
మబ్బు అడ్డువచ్చినా
నెలవంక వన్నె తరగదు!
ఆకలి నాగరికతను పరీక్షిస్తుంది.
దారిద్ర్యం సమాజాన్ని శపిస్తుంది.
స్వాతంత్ర్యం మానవుణ్ణి నవ్విస్తుంది.
అధికారం జనాన్ని కవ్విస్తుంది,
అంధకారం సంఘాన్ని తొక్కిపెడుతుంది!
అరుణోదయం నవతను ఆవిష్కరిస్తుంది!
నక్షత్రాలు నవ్వులు జల్లుతుంటే
మానవుడు ఉదయానికి దగ్గరవుతాడు,
ఉషస్సుకు స్వాగతం పలుకుతాడు,
క్రాంతికవాటాలు తెరుస్తాడు!

# చైతన్యం

కవిత్వాలు మనుషుల్నే
  కదిలిస్తాయి!
కవిత్వాలు మనసుల్నే
కరగిస్తాయి!
కవిత్వాలు విప్లవాగ్ని
రగిలిస్తాయి!
కవిత్వాలు శాంతివీణ
మీటిస్తాయి!
ఆశయాల తోరణాలు
కవితకు వజ్రాయుధం!
ఆ కవితే రగిలించును
విప్లవాగ్ని మంట,
ఆ మంటలు పుట్టించును
శాంతిపూల పంట!

*

# మండే సూర్యుడు

ఇది!
  ఉషఃకాలం
ఉదయగానం
ఆలాపించే
ప్రగతిరావం
ధ్వనించే
సమయం!
ఇది!
చీకటి
ఆఖరి శ్వాస
విడుస్తున్న
సమయం
స్వార్థం, మోసం
దీపంపురుగుల్లా
మాడి మసి అవుతున్న
మండే సూర్యుని కాలం
మానవత కై కొట్టే కాలం!

*

# భావనా వసంతం

స్వర్గలోక ద్వారాలు తెరచి రా రమ్మని
    కొమ్మ గొంతు గలగలలు!
వేయి గొంతులు నింపుకున్న
జలపాతపు హృదయాంతరాళంలోంచి
ఆగమన్న సంజ్ఞలు!
అడుగు ముందుకు పడదు,
చూపు వెనక్కు పారదు!
కలలన్నీ స్వర్గలోకాల ఇంద్రచాపం రంగులు!
వెన్నెల వెలుగులు కురుస్తున్న జాడ
అమృతపు జల్లులు పారుతున్న వేళ
గజ్జల రవళులు పిలుస్తున్న వేళ,
ఆశల పల్లకీలోంచి ఆనందలోకాలలోకి
మనసు తొంగిచూసే వేళ!
రేపటి వసంతం, సులిదెచ్చని
కలల జల్లులు నా గుండెలో నర్తిస్తాయి!
రేపటి ఆనందపు అనుభవాల రవళులు
నా మదిలో నవ్వుతాయి!
గుండెనిండా పన్నీటిజల్లులు
ఒంటినిండా వెన్నెల సుగంధాలు
కళ్ళనిండా విందుతనపు గడుసుదనాలు!
ఎక్కడినుంచో వినిపిస్తుంది
ఎటునుండో కవ్విస్తుంది!

చెరిగిపోని చిరంతన
జీవన సౌందర్య సంగీతం!
ప్రేమహృదయాల అనురాగ జ్యోత్స్న
ప్రభల సంకేతం!

*

# రేపటి వెలుగు

ఈ కాలం ఇలాగే ఉండదు
    ఈ మోడువారిన వృక్షాలు
చిగురించక మానవు!
ఈ చీకటితెర తొలగక మానదు
రేపటి స్వర్గానికి
శహదారులు ఏర్పడక మానవు!
ఈ నల్లని మబ్బులు తొలగక మానవు
మంచినీళ్ళకోసం త్రవ్విన బావిలో
భావికి శుభసూచనగా నీటి ఊట పడక మానదు,
స్వార్ధం గీసిన కృత్రిమ సరిహద్దులు
చెరిగిపోక మానవు!
వెలుగుబావుటా నీడలో తెలుగుతల్లి బిడ్డలు
కలిసి మెలసి గుజ్జనగూళ్ళు ఆడుకోక మానరు,
తెలంగాణ తెలుగు పీరుల
మాగాణి గాకమానదు.

* * *

సామాన్యుని ఆశలు నిరాశామయంగా
చంద్రనిప్పులు కక్కుతున్నా
స్వార్ధం అధికారపు ముసుగులో
కరణీకం చేస్తున్నా,
కోడి తనవల్లనే తెల్లారుతూందని భ్రమపడుతూన్నా,
భోగిమంట మనిషికి వేడెక్కించక మానదు.
ఏదో ఒక ఉగాది నవతకు
ఉగాదికాక మానదు!

ఈ కాలం మారుతూనే ఉంటుంది
ఈ జగం మారుతూనే ఉంటుంది
ఈ జనంలో కండబలం పెరిగిననాడు
ఈ గుండెల్లో క్రాంతికవాటాలు తెరుచుకొన్ననాడు
స్వార్థం ముక్కచెక్కలై చీకటి తొలగి
సమభావాల కాంతివెలుగులు
ఉదయాన్ని ఆవిష్కరిస్తాయి!
హృదయాలు చిగురిస్తాయి!

# పెద్ద చేప మృతి

అప్పుడే భళ్ళున తెల్లారింది!
ఇంకా వెలుగు ధైర్యంగా
ఊరుమీద పడడానికి తచ్చాడుతూంది!
సూర్యుడు కళ్ళు నులుముకుంటున్నాడు,
కాకి రెక్కాడించి కావు మంటూంది,
నిశ్శబ్దం భయంకరంగా ఆవలిస్తూంది
ఉదయం కిరణాల పహరాతో డ్యూటీలో ప్రవేశిస్తూంది
అప్పుడే భళ్ళున తెల్లారింది!!

* * *

పేపరు కిటికీలోంచి గిరాటువేసిన కుర్రాడి
సయికలుబెల్లు ఖంగ్‌మంది!
బానర్ హెడ్డింగ్‌లో నవభారత
ప్రగతి అందలాలు ఎక్కి ఊరేగుతూంది!
అదే పేజీలో చిన్న అక్షరాలలో
మూడు పంక్తుల్లో కన్నీరు పెడుతూంది
ఓ విషాద భయంకర వార్త
అన్నం లేక ఆకలి బాధను భరించలేక
పసిపాపను చంపి తన కంఠాన్ని
తనే ఉరి తీసుకున్న అభాగ్యురాలి వార్త!
రేడియోలో భక్తిని పంచిపెడుతూ
సుప్రభాతం గొంతు చించుకుంటూంది!
తల్లి ఒడిలో పాలు లేని స్తనాలను చూసి
జాలిగా పసిగుడ్డు నాలుక చాస్తూంది!

గోడమీద బల్లి చిన్న పురుగులను
చంఘిజ్‌ఖాన్‌లా నెమరేస్తూంది!
ఊరి చెరువులో కళ్మలం తిన్న పెద్దచేప
చచ్చి నీటిమీద తేలుతూంది!
సమాజంలో దరిద్రం తిష్ఠవేసుకొంది,
యువతలో అసంతృప్తి మండుతూంది,
ఈ సమాజం అన్యాయాన్ని వరించి
తనకు తానే ఉరి బిగించుకొంటూంది!

# కీర్తిశేషుడు

అనుక్షణం ప్రతి క్షణం
భయం భయంగా బ్రతుకీడుస్తూ
భయాల బాటలో ప్రయాణిస్తూ
గాలి సోకినా, మేఘం తగిలినా
రంపపుకోతలా అనుమానిస్తూ
రేపటిలోకి తొంగిచూసే మానవుడా!
ఇది ప్రజాస్వామ్యంలో వైజ్ఞానిక రహస్యం!
వచ్చే ఏడుపునీ, ఉన్న బాధనీ
కిక్కురుమనకుండా మింగుతూ
కత్తుల వంతెనమీద నడుస్తున్నా
పూలబాటమీద నడుస్తున్నట్లు నటిస్తూ
తెచ్చిపెట్టుకో నవ్వుని!
ఏడ్వలేక నవ్వు
నవ్వలేకా నవ్వు
ఇది ఈ ప్రజాస్వామ్యంలో
నీ బ్రతుక్కి తప్పదని తెలుసుకో నువ్వు!
పాలన బాగుందనీ
ఈ పాలనలో
సత్యం శివం సుందరం
దేశమంతా నిండి ఉందనీ
లేని బలం తెచ్చుకొని
గట్టిగా అరు!
తిండి ఉన్నా లేకున్నా
కట్టడానికి బట్ట లేకున్నా
గూడు ఉన్నా లేకున్నా

ఆకలితో ఆవురావురుమని
నిశ్శబ్దంగా చావు!
మరో లోకంనుంచి
అప్పుడు చూడు ఈ లోకాన్ని
గతంలో నీ దేశాన్ని!
నీకు మారుగా
నీ శిలావిగ్రహం నిలుస్తుంది!
నీ మెడలో పూలదండ వెలుస్తుంది!!

# వెన్నెల పడవ

నీమీద నీకు నమ్మకం ఉందా
  దేముడితో పని పెట్టుకోకు,
సమయాన్ని వృథాగా ఖర్చుపెట్టకు!

మనిషిమీద నమ్మకం ఉందా
రాళ్ళకు ముక్కులు చెక్కకు
చెక్కి నీకు నీవే చెంపలు వాయించుకోకు!

మనసుమీద నమ్మకం ఉందా
వయసుచేత మాట్లాడించడం నేర్చుకో!
వెన్నెల పడవలలో పయనించడం తెలుసుకో!

ఆ పడవను చుక్కాని పట్టి నడిపించావా
నీ గుండె గర్భగుడిలో
నీ దేవత ప్రత్యక్షం అవుతుంది!
నీ దేవి నీకు హారతి పడుతుంది!!

*

# నగరంలో గాలివాన

గాలీ వానా కూడబలుక్కుని
    అగ్రరాజ్యాల మారణాయుధాల్లా
ఊరుమీద విరుచుకుపడ్డప్పుడు,
పాతకాలంనాటి మండువా లోగిళ్ళు
భయంతో వణికి కప్పగా కూలిపోతున్నప్పుడు,
మామిడిచెట్టు చిగురుకొమ్మలో
భద్రంగా ఉంటుందని గూడు కట్టి
గుడ్లు పెట్టి వాటిని కాపలాకాస్తూ
గూటిపై పిల్లల భవిష్యత్తుని
గురించి ఆలోచిస్తూ కూర్చున్న కాకి
ఆ గాలి విసురుల రుస
రుసలకు తట్టుకోలేక
పిల్లల్ని వదిలి పారిపోతూ
కరెంటు తీగకు బలి అయినప్పుడు!
ఎవరికి పుట్టాడో తెలియని
ఓ దేముడి బిడ్డడు
పాడుబడ్డ దేవాలయంలో
ముష్టిమెతుకులు దాచుకొని
కొత్తకొత్త కుక్కలతోపాటు,
ఈగలతోపాటు తనూ తింటూ
గాలీ వానా తనమీద విరుచుకుని
కళ్ళు ఉరిమినప్పుడు
తన చింకిరిచొక్కా ఆలయం
తలుపుమీంచి ఎగిరిపోయి పారిపోయినప్పుడు
నగరం చూడడానికి

యుద్ధానంతరం భయంగా
కన్నీరు కారుస్తున్న పట్టణంలా ఉంది!
దేముడి రథంక్రింద చలికి
వణుకుతూ కూర్చున్న
ఓ ముసలిదానిపక్క ఓ కుక్క
పక్కనే, పుస్తకాలు తడవకుండా
తను ఏడవకుండా తలదాచు కొన్న
ఓ బడిపిల్లాడు ఉన్నారు!
గాలి చెట్లను విరిచి పరాక్రమం
చూపుతూంది బానిసలమీద
నియంతల అధికారంలా!
వర్షం జనంతో పరాచకా లాడుకొంటూంది!
గుడిసె కూలిపోయిన దృశ్యాన్ని
తలుచుకొని ముసిలిది
గుండె బాదుకొంటూంది
గోడమీద బల్లి పురుగుల్ని తిని
హాయిగా త్రేనుస్తూంది!
వడ్డీవ్యాపారి రతన్ లాల్
వంటింట్లో చపాతీ కాలి
నేతివాసన కొడుతూంది!
గాలివానకు దడిసి వ్యాపారి
గడపలో నిలబడ్డ
రిక్షావాడి కుంటిపెళ్ళాం తిట్లు తింటూంది!
ఎలెక్ట్రిక్ తీగలు పక్షుల్ని
ముద్దెట్టుకుని విడవనంటున్నాయి!
నగరంలో నిశ్శబ్దం భయంగా
వింతల్ని చూస్తూంది!
గాలీ వానా అలిసిపోయి

విశ్రాంతి తీసుకుంటున్నాయి!
శిథిలాలయంలో తలుపులు
బిచ్చగాళ్ళు వేసే చలిమంటలలో
ఒళ్ళు కాచుకొంటున్నాయి!
నేలమీద గాలీ వానా చేసిన
అఘాయిత్యాలను చూసి
నింగిమీద నక్షత్రాలు
ముక్కుమీద వేలేసుకుని
ఎందుకైనా మంచిదని
ముందుజాగ్రత్తగా
తలుపులు జేరేసుకొంటున్నాయి!

*

# ఆ చల్లని ఊళ్ళో....

ఆ చల్లని ఊళ్ళో ఉన్నప్పుడు
ఆ వెచ్చని ఒడి నా దైనప్పుడు
ఇంటిముందు గులాబీ విడిగినప్పుడు
లాన్‌లో విరజాజి నవ్వినప్పుడు
నా కళ్ళకు మాట్లాడడం అంటే ఇష్టం!
నా గుండెకు పాడడం అంటే ఇష్టం!

ఆ చూపులు నావైనప్పుడు
ఆ ఒంపులు నాకైనప్పుడు
నేలకేసి నక్షత్రాలు చూసినప్పుడు
నింగిమీద చందమామ సిగ్గుపడ్డప్పుడు
గూటిలోని పిట్టల జంట ఒకటైనప్పుడు
వెన్నెల్లో స్నానం చేయాలని ఉంటుంది!
వెలుగుతో మనసు విప్పి మాట్లాడాలని ఉంటుంది!

# ఈ కాలం మారేదెప్పుడు?

ఎటు చూసినా ఏమున్నది గర్వకారణం?
తుపాకిమోతలు, రేషన్ బ్రతుకులు
బందిఖానాలు, బ్రతుకుభయాలు
ఆత్మహత్యలు, అన్నమో రామచంద్రాలు
భాషావిభేదాలు, నీటికోసం తగాదాలు
ఒకరిమీద ఒకరు మోసాలు
ఓట్లకోసం, సీట్లకోసం
ప్రజాస్వామ్యానికి సమాధులు!

* * *

ఎటు చూసినా ఏమున్నది గర్వకారణం?
సమ్మెలు, ఘెరావోలు, మార్షల్ లాలు
పార్టీ ఫిరాయింపులు
ఆకలి, దరిద్రం, అనారోగ్యం,
మానభంగాలు, దోపిడీలు
కంచె చేను మేయడాలు
శాంతికపోతం భయంతో
గుడిగోపురంలో దాగుడుమూతలు.

# శబ్దంలోంచి శబ్దం

శబ్దంనుంచి శబ్దానికి
 తరంగంనుంచి తరంగానికి
ఆత్మనుంచి ఆత్మకు
కాంతినుంచి కాంతికి
క్రాంతినుంచి క్రాంతికి
పూవునుంచి పూవుకు
వెలుగునుంచి వెలుగుకు
మనసునుంచి మనసుకు
మెట్టునుంచి మెట్టుకు
సాగే కాలప్రభావాల ప్రగతికి
ప్రకృతి చెప్పే ధర్మం ఇది!
ఆచరించే కాలచక్రం ఇది!!

* * *

రాయితో రాయి కలిపితే
నిప్పు పుట్టినట్లు
మనసుతో మనసు కలిస్తే
ప్రేమ పండినట్లు,
పూవూ పూవూ మాట్లాడితే
మరో మొగ్గ తొడిగినట్లు,
వెలుగును చూసి చీకటి ఏడ్చినట్లు,
చీకటిపై వెలుగు పంజా విప్పినట్లు,
అన్యాయంపై యువత తిరగబడినట్లు

మారుతూన్న కాలం పాడుతూంది!
మారాలని మనకు చెబుతూంది!

*    *    *

శబ్దంలోంచి శబ్దాన్ని
కాంతినుంచి క్రాంతిని
క్రాంతినుంచి సంక్రాంతిని
మంచినుంచి శాంతిని
శాంతినుంచి సుభిక్షాన్ని
సాధించడానికి ఎదగాలి మనిషి!
ఆ మనిషి పెరగాలి మనీషి!!

# ఎండలు - మంటలు

ఎండలు మండిపోతూన్నాయి!
చెట్లు ఎండిపోతూన్నాయి,
తీగలు మాడిపోతూన్నాయి
నూతులే నీటిని త్రాగి త్రాగి
త్రేనుస్తున్నాయి!
బీదవాడు అన్నం దొరక్క
నీళ్ళతో పొట్ట నింపుకున్నట్లు,
రాత్రి నేలలోంచి వేడిసెగలు
మనిషిలో ద్వేషంలా కక్కుతూ వస్తూన్నాయి!
అర్ధరాత్రిసైతం పరుపులు, పక్కలు
వేడినిట్టూర్పులు విడుస్తూన్నాయి!
ఇండియా ఆటంపరీక్ష చేసిన వార్త విని
భుట్టో అనుమానాలను కక్కిన
మంటలా గాలి వేడిగా ఉంది!
తోటల్లో మొక్కలకోసం పెట్టిన
నీటిలో రెక్కలను ఆడించి
ఎండబాధను కడుక్కుంటున్నాయి
కాకులు, పిచుకలు!
వేసవి ఎండల పేరుతో పూరిపాకలు
తమలో తాము కలహించుకొని
కాలానికి సంఘటనల తోరణాలు కడుతూన్నాయి!
మనుషుల్లో ద్వేషం వేసవి ఎండల్లా మండి
దేశాలకు దేశాలే మంటలు కాలువల్లా పారుతూన్నాయి
స్వార్థాల గొంతుల్లో నిప్పులు
క్రికెట్ ఆడుకొంటున్నాయి!

# చీకటికి చెల్లు చీటీ

దీపాలు వెలిగించండి!
చీకటికి చెల్లుచీటీలు రాసి ఉంచండి.
దీపాలు ముట్టించండి, స్వార్థాలు మండించండి.
జ్యోతుల తోరణాలు అలంకరించండి
జ్యోత్స్నతరంగాలు ఆడుకోనివ్వండి
దీపావళి తారావళి జ్యోత్స్నవళిగా
గడపల్లో నవ్వుల పువ్వుల సరదాలకు
స్వాగతాలు పలకండి!
దాచిన చీకటిడబ్బుకి చెర విడిపించి
సామాన్యుల ప్రగతిబాటలో
బంగారం పూయించండి,
"సాహితీ"లత చిగురించేందుకు
కుదురులో ఆశయాల నీరు నింపి
సమసమాజ ప్రస్థానానికి జ్యోతులతో
మునుముందుకు సాగండి!
గోడల్లో మేడల్లో మిద్దెల్లో
కొండల్లో నూతుల్లో పడకటింటి అద్దాల్లో
బంధించబడిన లక్ష్మి
చీకటి గుయ్యారంలో ఎంతకాలం దాగుంటావు?
దీపావళి వెలుగుల్లో తారావళి నవ్వుల్లో
మతాబాల ముత్యాల్లో టపాసుల హడావిడిలో
పాలు పంచుకొనేందుకు అయినా రావాలి
నీ పూజకోసం పూలు ఎండకుండా చూడాలి.
తిండినీ బట్టనీ డబ్బునీ భూగర్భాల్లో దాచే
చీకటి రాక్షస సంహారానికి

గాండీవం ధరిస్తున్నాను నా జనాన్ని ఆదుకోవడానికి!
సవ్యసాచినై నిలుస్తున్నాను
నా దేశం ప్రగతి ప్రమిదల్లో
క్రాంతిదీపాలు వెలిగించడానికి!

# కుడి ఎడమల....

ఒకపక్క తిండిలేని అనాథలు
మరోపక్క గూడులేని నిర్భాగ్యులు
దగాపడ్డ అమాయకులు
నైలాన్‌చీరల మోసంలో
మానం కోల్పోయిన పతితలు
అనాదిగా అణచబడ్డ నిర్భాగ్యులు!
అటుపక్క మిద్దెమీద
స్ప్రింగ్‌కుషన్ మంచంలో
తిన్నది అరగని భోగి
పక్కన వజ్రపు ముక్కుపుడక మెరుపుతో
పీపాలా ఉన్న శరీరానికి
వంశపారంపర్యంగా వచ్చిన
తామరగజ్జిని గోక్కుంటూ
భర్త బొజ్జమీద తమలపాకుల
సరసాలు ఆడుతూన్న భార్య!
దరిద్రాన్ని ఎదిరించి ఎదిరించి
అలసిపోయి సొలసిపోయి
ఒంటరితనంలో కాలపు
జడివానల్లో తడిసిపోయి
సమాజంచేత నిరాదరించబడి
ఆదరణ లేక, గత్యంతరం లేక
ఒడిలో పిల్లాడికోసం
మిగిలిన ఎముకలగూడునే
రసికునికి అప్పజెప్పి
శృంగారరసాన్ని అర్పించవలసినదానికి బదులు

రక్తాన్ని హారతిపడుతున్న ఆడది!
భర్తతో సంతృప్తిపడలేక
పిస్తా తిని బస్తాలా పెరిగిన
శరీరాన్ని క్లబ్బులో నాగరికత
కట్టెన్న అలంకరణలతో
సమాజాన్ని నడిపిస్తున్న,
యుక్తవయసు స్త్రీ!
తిని తిని సగం వదిలి ఆకుల్ని
బయటకు పారేసేందుకయినా
వంగని బొజ్జలవాళ్ళు కొందరు!
ఆ ఎంగిలి ఆకులకోసం
కాట్లకుక్కలతో యుద్ధానికి
ప్రాణాలు బలిపెట్టేవాళ్ళు కొందరు!
ఇదీ—ఈనాటి కుడిఎడమల
కుసుమపరాగం....

# ఈ తరం నా తరంగా....

ఈ తరం నా తరంగా
నా తరం ఈ తరంగా
కవిత గమ్యానికి చేరువగా
నవకవిత గుమ్మానికి దగ్గరగా
యువతగుండె గొళ్ళెం తీసి
గుండెవాకిట తిష్ఠవేసి
పలుకుతుంది నా కవిత!

ఈ తరం యువతరం
గుండెసవ్వడిలో సవ్వడిలా
నా కవిత పాడుతుంది!
ఈ తరం సమస్యలను
నా వీణ మీటుతుంది!
నా వాణి పలుకుతుంది!

ఈ తరం నా తరంగా
నా తరం ఈ తరంగా
కవిత గమ్యానికి చేరువగా
నవకవిత గుమ్మానికి దగ్గరగా! ❋

# నాకు నమ్మకముంది!

నాకు నమ్మకముంది!
ఈ జగతి ఇలాగే
చీకటి దుప్పటీ కప్పుకొని
మూలుగుతూ పడి ఉండదని!
నాకు నమ్మకముంది!
ఈ ధరిత్రి ఇలాగే
మోడువారిన వృక్షంలా
ఆశ ఉడిగిన హృదయంలా
నిరాశల నిశ్వాసాలు వదులుతూ పడి ఉండదని.

* * *

ఈ బంధించిన ఇనుప గొలుసులు
తెగి గుండె బ్రద్దలయి ఏడ్వక మానవు
ఈ అధికార కబంధ హస్తాలలో
అధైర్యం ప్రవహించి వారిని ఉరితీయక మానవు!
జైలుగోడలు బీటలువారి
స్వాతంత్ర్యానికి సలాం కొట్టకమానదు.
ఈ జైళ్ల కట్టిన కూలీలనే
ఈ జైళ్లలో బంధించిన కసాయితనాన్ని
కాలం నిలదీసి అడక్క మానదు!
ఈ జైళ్లు చీకటి రాక్షసుల
పాలిటి సమాధులుగా
మారిపోక తప్పవు!

వీటిపైన రాబందులు
పీనుగుపెంటలను విల్వచేపి
ఏ గాలివిసురుకో చావక మానవు!

నాకు నమ్మకముంది!
సామాన్యుడు జయిస్తాడని!
పదితలల రావణుడే
ఒక్క తలగల మనిషి చేతిలో
చావక తప్పనట్లు
కోటానుకోట్ల సామాన్యుల
అసంతృప్తి జ్వాలల్లో
అధికారం మసికాక తప్పదు!

నాకు నమ్మకముంది!
ఈ చీకటి మరణిస్తుందనీ
వెలుగు ఉదయిస్తుందనీ
రేపు జనాన్ని స్వేచ్ఛగా
గాలి పీల్చుకోనిస్తుందనీ!!

# వేడి - వెలుగు!

ఈ నేలను పచ్చగా బీడుగా మారుస్తున్న
ప్రభువుల నియంతృత్వ భావాలకు
ఉరిశిక్ష విధించేందుకు
దండోరా వేయించండి!

ఈ దేశాన్ని కాష్ఠంగా కాల్చుకుతింటున్న
నియంతల నిజస్వరూపాలకు
సమాధులు నిర్మించడానికి
బంజర్లు కేటాయించడానికి
ప్రకటనలు వేయించండి!

ఉంచుకున్న ముండ మెడలో
నమ్ముకున్నదాని శాపనార్థాల
గొలుసు మెరుపుల వెక్కిరింతలు
కొత్తతరానికి గుర్తుగా
టేప్ రికార్డ్ చేసే ఏర్పాట్లు చేయించండి!

న్యాయశాస్త్రం గొంతులో మతం
మందు, రాజకీయాల విటమిన్లు
అడ్డుపడి ఊపిరి సలపకుండా
చేస్తున్నాయి - డాక్టర్‌ని సిద్ధంగా ఉంచండి!
పాతకాలపు బూజుని దులిపి
కొత్తరంగుల వెలుగులతో
వాదస్తాన్ని ఊరేగించి
నవతను మోసగించి
లాభాలు బేరీజు వేసుకొనే
ప్రయత్నాలు జరుగుతున్నాయి.

యువకులను మేలుకువగా
ఉండమని చెప్పండి!
చీకటి వంటచెరుకును
చిన్న చిన్న పుల్లలుగా నరికి
భయాల జైల్లో వణుకుతున్న
గుండెల్లో వేడి - వెలుగు పుట్టించడానికి
తరుణం మించకుండా
నగారాలు నినదించడానికి
కలాలనూ, గళాలనూ
సిద్ధంగా ఉంచడం కర్తవ్యంగాభావించండి! ❋

# కాంతిపరివేషం

నా కవితకు శబ్దానివి నువ్వు
నా కవితా శంఖారావానికి
భావతరంగం నువ్వు!

భావితరాల క్రాంతిపథాల
ప్రస్థానకేతనం చేసే
రెపరెపల సవ్వడి నువ్వు!
నా భావలయకు పల్లవి నువ్వు!

నా హృదయ ఉచ్ఛ్వాస నిశ్వాసాల
సరిగమల జీవిత అమృత
జల్లుల సవ్వడిలో నాడి నువ్వు

ఆ నువ్వే నా కవిత,
ఆ కవితే నా గుండె!

# గుమ్మడిపూవు నవ్వాలి!

ఆ కన్ను అలాగే నిలుపు!
కనుబొమల నీడల్లో
నా బొమ్మ జాడలు
వెతుక్కుంటాను
ఆ కన్ను అలాగే నిలుపు!

* * *

ఆ పాట అలాగే పాడు!
పదనిసల కెరటాల బాటల్లో
నా కొమ్మ రూపులు
చూసుకుంటాను
ఆ పాట అలాగే పాడు!

* * *

ఆ చూపులో నీడ
ఆ పాటలో రూపు
కుంచెతో బొమ్మేయాలి!
గుమ్మడిపూవు నవ్వాలి!

# పారాణి

ప్రగానవత పాదాలకు
పారాణి అద్దుతా
జనత గుండె వాకిటలో
ముత్యాల ముగ్గులు తీరుస్తా!

నా దేశం పొలిమేరల్లో
మెలకువ మందు దట్టించి
క్రాంతి తోరణాలు
వ్రేలాడగడతా!

కళ్ళలో ఆనందాన్ని
సుర్మాలా తీర్చి దిద్ది
పెదాల మాటల పాటల్లో
మానవ మహోన్నత
గీతం వినిపిస్తా!

*

# నిశ్శబ్ద శబ్దం

గబగబా పరువెత్తుతూన్న మబ్బుల రెక్కలు
ఎగిరెగిరి పడుతూన్న సమయంలో

గుండె పొదిగట్టున రంగుల రంగవల్లికల
గుసగుసల తరంగాల వలయంలో

ఆశ నిరాశల ఉయ్యాల గొలుసులు
ఏవేవో పళ్ళు కొరుక్కుంటున్న సమయంలో

ఊరుచివర పచ్చచేల గట్టున
కందిపూవు పక్కుమంది నిశ్శబ్దం!

గట్టుమీదినుంచి బోదికాల్వలోకి
గుబుక్కున ఉరికింది కప్ప–శబ్దం!

*

# గుండె తాళం

గుండె తాళం వేసి
మనసుకు ముసుగు తొడిగి
కళ్ళకు నల్లద్దాలు పెట్టి
సంజ్ఞలు చేయకు!

తెరువు
గుండె తలుపుని

పిలువు
నీ దేముణ్ణి

నిలుపుకో
గుండెగుడిలో

పిలిస్తే పలికే
నిజమైన దేముణ్ణి!

# ప్రస్తుతం

ఆసుపత్రిలో ఆఖరు బెడ్‌లో
ఆదరంలేక ఊపిరి రాక
ఊఁకొట్టే జోకొట్టే వారు లేక
నోట పిలుపు లేక
రోగానికి మందులు లేక
అస్థిపంజరంలో ఆఖరిప్రాణం
ఆశతో కొట్టుకుంటున్న దృశ్యంలా
ఉంది ఈ సమాజం!

ధర్మాసుపత్రులమ్మట ఏళ్ళతరబడి తిరిగి
అలా అలా తెలియకుండానే
భారతదేశపు జనాభాలా పెరిగిన
ఊపిరితిత్తుల్లో టి. బి. చిల్లులు
ఎక్స్-రేలో చూసి నేరం రోగి దన్నట్లు
ఇది పూర్వం చేసిన పాపమన్నట్లు
ముఖం పెట్టిన
ఆసుపత్రి నిజాయితీలా ఉంది
ప్రస్తుతం!

*

# అంగార రాగం

చీకటితో నిండిన
  నిరాశతో వడలిన
మోసాల దగాలతో
బ్రతుకు వాడిన
గుండె లోతుల్లో
దివిటీలు వెలిగిస్తా!

కాంతికోసం చీకటితో
సమరం చేస్తున్న ప్రస్తుతానికి
దివిటీలు పుట్టిస్తా!

ఈ విప్లవ ఖడ్గానికి అండగా
నా కండను అతికించి
బలాన్ని చేకూర్చి
విప్లవిస్తాను!
అంగార రాగాన్ని వినిపిస్తాను!

# పిడుగు!

ఒంటరిగా చార్మినార్‌కు
దూరంగా భయంగా
బస్‌స్టాప్‌కు దగ్గరగా
కళ్ళలో కన్నీరు దాచుకొని
గొంతులో నీటిని వెతుక్కుంటూ
నిలుచున్న అమ్మాయిని చూసి
మొగుణ్ణి మోసగించి వచ్చిన
ఆడదని అంచనా కట్టి
మెలికలు తిరుగుతూ దగ్గరకు
వెళ్ళిన నవనాగరిక యువకుడి
చెంపమీద
పిడుగు పడ్డ చప్పుడు!
కాలాన్ని కాలం వెక్కిరించిం దప్పుడు! ❋

# ఊపిరి

నిషాలతో ఖుషీలతో
  మత్తెక్కిన నీడలపై
నిజాల రేఖాచిత్రాలు చెక్కాలని వచ్చిన శిల్పిని!

సత్యం శివం సుందరాల సానపై
పదును దేరిన ఉలిని!
రాక్షసత్వంపై విరుచుకుపడే బెబ్బులిని!

కొత్త ప్రపంచాన్ని అక్షరాల
రేఖల్లో విరచిస్తున్న ఋషిని!
నిన్నటికి ఉరి విధిస్తున్న కర్తని
రేపటికి బ్లూప్రింటు రాస్తున్న బ్రహ్మని!

నిషాలతో ఖుషీలతో
మత్తెక్కిన నీడలపై
నాగరికత కథలను,
రేఖాచిత్రాలను చెక్కాలని
ఉలి పట్టిన శిల్పిని!
నవోదయానికి ఊపిరిని!!

# ఒకేచోట....

ఇది నా గడ్డ, ఇది నా కొండ, ఇది నా నీరు
అనుకొంటూ కాకుల్లా వినిపిస్తూన్న గావు
కేకలు చూసి యువకులు దడుసుకొంటున్నారు!

ఇది నా భాష, ఇది నా చరిత్ర, ఇది నాది
అనే సంకుచితత్వం వెర్రి పలవరింతలు చూసి
జనం దడుసుకొంటున్నారు!

పుడతావు ఒకచోట, పెరిగి పెద్ద అయి
పొట్టకోసం పరుగులు మరొక చోట
కాలంతో పరుగెత్తి విసుగెత్తి
ఆగిపోతావు - గుండె ఆగిపోతుంది
ఎక్కడో మరెక్కడో మరో చోట!
పాలల్లో పాలమీగడల్లో వెన్నెల్లో
గాలిపంకాల సేవల్లో కుషన్‌కుర్చీల హాయిలో
నేతిచపాతీల దర్జాల్లో, డబ్బుతో
కొనుక్కొన్న మాయజలతారు
శృంగారంలో ఆడుకొనే భాగ్యశాలీ
రాళ్ళల్లో రప్పల్లో, చేలల్లో పొలాల్లో
చెట్లపై, పుట్టలపై, ఏటిగట్లపై
నీటి పడవలపై కండలు కరగించే
శ్రామికుల జీవితాలు—
ఒకే చోట కలుస్తాయి — శ్మశానంలో!
ఒకే కట్టెకు బూడిద
అవుతాయి చితాగ్నిలో!

# రేపటి బ్లూ ప్రింటు

కైలాసగిరి శిఖరంపై ఆదిదంపతుల
 తాండవ లాస్యాలలోని లయను నేను
నింగి శిఖరాగ్రాన చిన్నారి పొన్నారి
జాబిల్లి గోరుబువ్వల పాటలో పల్లవిని నేను
వేదాల సారభూత గాయత్రి బీజాక్షరాన్ని నేను.

ఘనాపాటీల ఓంకారాలతో ప్రతిధ్వనించిన పల్లె ఆది
పట్టుపరుపులమీద జోకొట్టబడిన
కవిత కన్నెత్తి కొత్త చరిత్రకు
స్వర్ణ పట్టాభిషేకం చేయించిన
రసగంగాధరుని జన్మభూమి అది.

దండనాథులనీ, దండధరులనీ
తర్కాలతో, పాండితీ సీమంతాలతో
నవ్వించిన జగన్నాథుని ప్రతిభా
పభంజనాలు దద్దరిల్లిన తెలుగు నేల నాది.

అక్షరాలకు తేనె తినిపించి జాతికి
వెలుగు బావుటాల సాహితీ సమారాధనం
చేయించిన నన్నపార్యుని
రత్నాల రాణ్మహేంద్రకోటిలింగాలక్షేత్రం నాది!

గలగలా గోదారి కెరటాల తరగలతో
వేదలయల సన్నాయి సయ్యాటలు
ఆడి పాడి వినిపించి తరించిన
చాళుక్య సీమ నాది.

బుద్ధదేవుని సందేశాలను
నల్లని రాలలో పొదిగి శాంతిని
ప్రపంచానికి వినిపించిన
ఆరామాల కాణాచి నాది - దాక్షారామ
భీమేశ క్షేత్రభూమి ఇది.

జైనమతాన్ని సైతం ఆదరించి
మతసహనం మానవధర్మంగా
వేదధర్మాన్ని ప్రవచించిన
తాటిపాక ప్రక్క మునిఖండగడ్డ నాది!

కాలపు గాలివానల నెన్నొ తట్టుకొని
కాలప్రవాహంలో ఈదుకొంటూ
కాలరేఖలమీద నిటారుగా నిలిచి
రేపటి నిన్ననే కలగన్న వెలుగు నేను.
మారే కాలంతో పరుగెడుతూ
మార్పులనీ చేర్పులనీ వరిస్తూ
జడివానలను తట్టుకొంటూ
మబ్బులను దాటుకొంటూ
సీసాల రసాల పాలవెల్లిని
ముత్యాలసరాలతో అలంకరించుకొని
సుప్తచ్ఛందాల హారాలతో భావిని తీర్చి
కొత్త తరం ఆశలు గానంచేసే గాయకుణ్ణి.
మానవతా హృదయంలో శాంతిశంఖాలు
మ్రోగిస్తూ క్రాంతిదివిటీలతో
విశ్వాంధకారాన్ని నిర్మూలించ
ప్రతిజ్ఞగొన్న శివశంకరుణ్ణి నేను.
సత్యాన్ని నేను, సుందరాన్ని నేను
కిటిక కసాయి రాచరికంపై
కణకణ మండే త్రేతాగ్నిని నేను.

అగ్నిగర్భను చీల్చుకుని
ఆవిర్భవించిన జ్యోతిని నేను.

రాయితో రాయిని రాపాడించి
అనలాన్ని రగిలించి
తిమిర నిర్మూలనానికి
చండప్రచండ భానుడినై పిడికిలి బిగించిన
నేటి నవసమాజ బ్లూ ప్రింటును
సిద్ధంచేసిన శిల్పిని నేను
బ్రహ్మను నేను
సామ్యవాదిని నేను.

*

# భవిష్యత్తుకు పిలుపు

నా పాట భవిష్యత్తుకు పిలుపు
దాని రంగు ఎరుపు
చిట్టచివరకు దాని తత్త్వం గెలుపు!

దారిద్ర్యం లేని, దొరతనం లేని
చీకటి లేని, మోసం లేని
బానిసత్వం లేని, బందిఖానాలు లేని
బాటకు రమ్మని పిలిచే పాట ఇది
అపస్వరాలు పలకని కొత్త పాట ఇది!

సూర్యునిలో వేడిని తాగి
చంద్రునిలో వెన్నెల మేసి
నయాగరా పరవళ్ళలోని
విద్యుత్తును అక్షరాలకు అద్ది
దీప స్తంభాలుగా నిలిపిన పాట ఇది.
యువత బాటలో వెలుగు వెలార్చే
క్రాంతిదివిటీల పాట ఇది!

*

# కాలం

మనిషిని తనతో చేయి పట్టుకుని
  లాక్కువెళ్ళేది కాలం!

మనిషిని పశువుగా మార్చేది
పోయే కాలం!

మనసుని చూపులతో
ఆకట్టుకొనేది గాలం!
చల్లగాలి పిల్లతెమ్మెరల హాయి
గొలిపేది భూపాళరాగం!

# ఎండను మింగి....

ఎండను మింగాలనీ
వెన్నెల కురవాలనీ
సూర్యుణ్ణి నమిలేసి
చల్లదనం పంచాలనీ
మంటను తాగేసి
అమృతం పంచాలనీ
అనుకోవడంలో త్యాగం ఉంది!
అలా జరగడానికి మనిషి
త్యాగం అవసరం ఉంది!

* * *

చీకటిని కరకరా తినేసి
వెలుగుని కక్కాలనీ,
వెలుతుర్ని గుప్పిళ్ళతో చేర్చి
దోసిళ్ళతో పంచాలనీ
నిప్పుల్ని నీళ్ళతో కడిగేసి
నిజాలు ప్రతిష్ఠించాలనీ
ఆశించడంలో మనిషితనం ఉంది
అది విజయవంతం కావడానికి మనిషి
మంచితనం అవసరం ఉంది!!

# సఖ్యత

తెలుగుకీ వెలుగుకీ
వేస్తాను పందిళ్ళు,
కాంతికీ క్రాంతికీ
చేస్తాను కుదుళ్ళు.

మనసుకూ మంచికీ
వేస్తాను రహదార్లు.

రాకాసుధాకరుని
నెలవంక వాకలో
తెలుగు కవితాకన్య
నృత్యశోభను చూపి
విశ్వభారతి స్వర్ణ
పతకమే తెస్తాను!
తిమిరాన సమరాన
విజయమే తెస్తాను,

# నాకెవరూ లేరు

నాకెవరూ లేరని ఇప్పుడే తెలుసుకున్నాను
నాకై కన్నీటిబిందువు రాలదని
ఇప్పుడే తెలుసుకున్నాను
నా వెర్రినమ్మకాల నీడల్లో
నిన్ను నమ్మాను.
నా తొందర పెదిమలతో
నీ పెదాలను జుర్రుకున్నాను.
కాని, అది అబద్ధపు కల అనీ
కాగితం పడవలనీ
ఇప్పుడే తెలుసుకున్నాను
నీ ఉత్తరాల ఉద్దేశ్యాలు
ఉద్దేశ్యాల గుసగుసలు
మోసంతో మలచిన చెమికీదండనీ
చూపులతో బంధించిన మత్తనీ
ఇప్పుడే తెలుసుకొన్నాను.

నాకెవరూ లేరని
ఎవరూ ఏమీ కారని
కాలప్రవాహంలో అనుభవాలను
కొలుచుకొన్నాను!
వలచిన రూపాన్ని
తలచిన రూపాన్ని
గిరాటు వేస్తున్నా
తిరిగిరాని చోటుకి
తలపులోకి రాని చోటుకి!

# ఈ రోజైనా....

ఈ రోజైనా దేశం నిండుగా నవ్వుతూ
నిజాయితీగా బ్రతకాలనీ
ఎగిరే పతాకం నీడలోని నాయకుల
హృదయాల్లో నిజం నిప్పులా నిలవాలనీ,
ఆకలినీ, దారిద్ర్యాన్నీ, నిరాశనూ మరచి
ఆశతో చూస్తున్నాను - అందుకై
ఎదురుచూస్తున్నాను!
ఈ రోజు గుడిసెలలో బుడ్డిదీపంలా బ్రతుకులు
ఈడుస్తున్న సామాన్యుల్లో ఆత్మస్థైర్యం
జండాలో, అందులోని రంగుల సంకేతంలా
అగ్నివీణ వినదించే
కావ్య గీతంలా బలపడాలనీ,
సామాన్యుని బ్రతుకుబాటలో
ఆశల మల్లెల పరిమళాలు
స్వాతంత్ర్యగీతం వినిపించాలనీ,
నిన్నను మరచి
నేటి గృహప్రాంగణాన నిలిచి
రేపటికోసం చూస్తున్నాను.
అన్నం, బట్టా కరవై - హక్కుల
పోరాటాల కత్తుల వంతెనమీద నిలిచి
ఆశతో చూస్తున్నాను.
అరుణోదయంకోసం
అనుక్షణం సుమధుర క్షణాలు
లెక్కపెడుతున్నాను!

*

# రేపటి ఉదయాన్ని నేను

ఈ తరం నాయకుడిని!
　　యువతరం ఆశకు రాగాన్ని!
ప్రగతిగీతి సవ్వడిని!
రేపటి ఆశయాలకు జీవనాడిని!

ప్రస్తుతం ఎముకలు విరిగేలా,
చమటలు తడిసేలా శ్రమిస్తున్నా
డొక్కలు ఎండుతున్నా, కండలు కరుగుతున్నా
ఉదయం దగ్గరలో ఉందనే నమ్మకంలో ఉన్నవాడిని
ఉషోదయంకోసం ఎదురుచూస్తున్నవాడిని—
ఈ తరం నాయకుడిని!
నవతరం జీవనాడిని!

వెలుగుకోసం చీకటిపై
గెలుపుకోసం ఘర్షణపడుతున్నవాణ్ణి
శాంతికోసం క్రాంతికోసం
నా అక్షరాల అక్షౌహిణీలతో
నగారాలు మోగిస్తున్నవాణ్ణి
నవత వ్యక్తిత్వం నిరూపించడానికి
యువతను మేలుకొలుపుతున్నవాడిని
ప్రగతికై ప్రతి క్షణం తపిస్తున్నవాడిని!
ఉదయించే సూర్యునిలా
హృదయాలు ఉదయించాలని కలలు కంటూ
నెలవంక నవ్వుల్లా మనసుల్లో
మల్లెలు పరిమళించాలని

అనుక్షణం ప్రతి క్షణం గుండె సవ్వడితో
రాగాలు మీటుతున్నవాడిని!
రేపటి ఉదయాన్ని నేను
ఆ ఉదయంలో అరుణ కిరణాన్ని నేను! ❋

# సంక్రాంతి జ్వాల

చలిలాంటి బద్ధకాలను
  భోగిమంటలతో వెచ్చజేయి
రగిలించు రక్తాన్ని
ఉత్సాహప్రగతి సంకేతంగా!

* * *

విడిగి విరిసిన నవ్వుల జల్లుల
గుమ్మడిపూల కొంతెతనాల
సౌభాగ్య సీమంతాన్ని ఆవిష్కరించు
గొబ్బెమ్మల మండపాలు నిర్మించు!

* * *

వెలుగు సంకేతమై తెలుగు పతాకంలా
రతనాల రంగువల్లుల రేఖల్లో
అష్టవిధ కన్యల నృత్యాల చిహ్నాలని
ఆనందపర్వ లావణ్య కేళిలా
సంతోష సౌరంభ శ్రీమంతసీమగా
తెలుగు వాకిట హరివిల్లులా
ముగ్గులతో వెలుగుపందిళ్ళు వేయించు!

* * *

నవ్వలేక ఏడ్వలేక
బ్రతకలేక బతుకుతున్న
చలిలో వణికే నిర్భాగ్యుల
సహస్ర హృదయాలలో
కాంతి నవ్వాలి - సంక్రాంతి రావాలి!

అది నవయువ కవితా బీజాక్షర పతనం కావాలి!
గూడు లేక గుడ్డ లేక
నవప్రపంచంలో రామరాజ్యమని
పిసీళ్ళలో రాసుకుని విస్తంత్రీ యంత్రాలచేత
భజగోవిందం పలికిస్తే చాలదు
ఆ అభాగ్యుల పెదాలు చలికి
గడ్డ కట్టకుండా చూడాలి!
అప్పు డది సంక్రాంతి!
అదెప్పటికీ ఆరని నవ క్రాంతి!

* * *

కట్టె ఏదైనా కాలేది ఒకటే,
ఆ వెలుగుమంట చెప్పే
నిప్పు నిజాల సత్యాలూ ఒకటే!
ఎక్కడైనా ఆకలి ఛందస్సు ఒక్కటే!
ఆ ఛందస్సు తప్పిందంటే
అసంతృప్తి జ్వలితజ్వాలై
దావానలంగా లేచి శపిస్తుంది!

* * *

మనిషి మనిషిగా బ్రతికే లోకాన్ని
మనసు నిండా మధువులు నింపే కాలాన్ని
మమతానురాగాల సరిగమల
రాగాల విందుల క్షణాన్ని
ఆహ్వానించు అనుశాసించు!
అందరికీ అది నిజం చెయ్యి!
ఆ కాలం సంక్రాంతి కాలమని
నీ కవితా మహతిని మీటి నిజం చెయ్యి!!

# నేను రవిని

నేను కవిని!
నేను రవిని!

నా దేశపు ప్రగతి రథపు
చోదకుడిని!

నా జనం ఆశల పల్లకీ
బోయీని!

నేను కవిని!
నేను రవిని!

ఎండల్లో కండలు కరగించే
శ్రామిక సంతతివాడిని!
చెమటతో తడిపి పండిన
పంటచేల నవ్వుల సవ్వడిని!

నిజాల మంటల జ్వాలల్లో
నిజాయితీగా నవ్వేవాడిని!
నవ్వుపూల బాటల్లో జనంతో
కరం కలిపి ఉషస్సును పిలిచేవాడిని!
నేను కవిని!
నేను రవిని!

# ఈ తరం గుండె
# ఈ కవిత!

కలకాలం నిలుచునదీ
 కలకాలం పలుకునదీ
మనసును స్పందించునదీ
ప్రగతిని సాధించునదీ
జగతిని మేల్కొల్పునదీ
జనతను నడిపించునదీ
దేవుళ్ళను మరపించి
దేవతలను సృష్టించునదీ
అక్షర విన్యాసంతో
సుందరాన్ని పంచునదీ
ప్రగతి కవిత నా కవిత!
ఈ తరం గుండె ఈ కవిత!

# నవ్వగలను....

నేనూ—

నిండు పున్నమి చంద్రునిలా
వికసించిన సన్నజాజి పూవులా
చిగురించిన గున్నమామిడి కొమ్మలా
నవ్వగలుగుతాను—
అది—
నా జనం నిండుగా హాయిగా
జీవిస్తున్నారని తెలిసినప్పుడు
బక్కచిక్కిన పొట్టలో కనీసం
గంజినీళ్ళైనా నిండుగా ఉన్నాయని విన్నప్పుడు!

* * *

నేనూ—
లేడిలా హాయిగా గెంతులు వేయగలను
నెమలిలా పురి విప్పి ఆడగలను
ఆనందభైరవిలో ప్రగతిపాట పాడగలను
అది—
ఈ సంఘాన్ని కమ్మిన
నిశిలో ఉషస్సు నవ్వినట్లు తెలిసినప్పుడు
తరతరాల నిశీథాల గుండెల్లో
ఉషోదయ కిరణం మెరిసినప్పుడు,

* * *

నేనూ—
హాయిగా జీవించగలను

సాటిమనిషి కళ్ళలో
కన్నీరు కారనప్పుడు
నా దేశం చీకటి రాజ్యంలో
జ్యోత్స్నావళి నృత్యం చూపినప్పుడు
స్వాతంత్ర్య శంఖాల ధ్వనుల
బాకుల వాడికి నిరంకుశపు
జైలుగోడలు బ్రద్దలయినప్పుడు
ఆనందం అందరి ముఖాలలో
వికసిత మందార మైనప్పుడు.

*

# జలధార

నిశ్శబ్దం పలకరించే సమయంలో
శబ్దం వాక్యమై మాట్లాడే కాలంలో

ధ్వని రాగమై పాడే సమయంలో
పక్షి రెక్క విప్పి ఎగిరే సమయంలో

మొగ్గ రేక విచ్చే సమయంలో
కవిత మనిషిని నవ్వించే సమయంలో
సాహితి ప్రగతిని ఆహ్వానించే సమయంలో

దేశం చల్లని కన్నతల్లి లా ఉంటుంది!
ప్రజ నిశ్చల నిర్మల జలధారలా ఉంటుంది.

# ఈ మధ్య గాలిలో....

ఈమధ్య గాలిలో మార్పు వచ్చింది
గ్రహించావా, మిత్రమా!
పిల్లగాలులూ చల్లగాలులూ
ఏటిగాలి నీటిగాలి పైరుగాలి
ఎక్కడ చూసినా వేడి కనిపిస్తూంది
బద్ధకాన్ని కరగిస్తూంది
అబద్ధాన్ని ఖండిస్తూంది
తిని పని చేయమంటూంది
పనిచేసి తినడం నేర్చుకోమంటూంది
మాటలు కట్టిపెట్టి
చేతలకు ఉపక్రమించమంటూంది
ఈమధ్య గాలిలో ఈ మార్పు
ఆరోగ్యకరంగా కనిపిస్తూంది
ఆరోగ్యం కలిగిస్తూంది.
ఈ ఆరోగ్యం వంటపట్టడానికి
కాస్త ఓపిక పట్టవలసి ఉంటుంది!

# సంస్పందన

చిరునగవుల కొసల మెరుపు తుదలమీద
  చామంతుల పూబంతుల
గుండెల పొదిగట్టిన
విడిచిన పూలకన్నెల
కోర్కెల గుండెలమీద

వెన్నెల కిరణాల గుసగుసలమీద
నీటి కెరటాల కొనలమీద

నిలుస్తా నిలువెత్తు చూపులతో
రచిస్తా ప్రపంచ మానవాళి
హృదయ స్పందనలో
నా ఘంటాన్ని రంగరించి
మానవతా గీతం!
ప్రగతీ ప్రస్థాన కేతన సంగీతం!!

# నిలుస్తా

మానవత బ్రతికి
బట్ట కట్టడానికి
మనిషి మనిషిగా
జీవించడానికి

గాలీ నీరూ అందరికీ
సమంగా దక్కడానికి

విడిచే పూలనవ్వులకు
పహరాగా నిలవడానికి

కాలరేఖమీద నిలిచి
నగారా మోగిస్తా!

నవతకు ఆహ్వానం పలికి
యువతకు అండగా
నిలుస్తా!!

*

# ఈ రోజు విన్నానొక శుభవార్త

ఈ రోజు ఎంతో హాయిగా ఉంది
వియత్‌నామ్‌లో మూలమూలా ప్రశాంతంగా ఉంది
గద్ద గాలిపెట్టుకు చావుదెబ్బ తింది
రాబందు గోళీకాయ
ధాటికి గుటుక్కుమంది!
ఈ రోజు ఎంతో హాయిగా ఉంది!

* * *

నిజాయితీ గెలుస్తుందన్న
నిజం వియత్‌నామ్‌లో ఋజువయింది—అది
బూర్జువా నియంతల
కాలానికి చెల్లుచీటీ అయింది.

విశ్వమానవ విజయంగా
వియత్‌నామ్ యుద్ధం పరిసమాప్తం అయింది!

# ఆశయం

నవ్వుల పువ్వుల జల్లులతో
  బ్రతుకంతా తడిసి శాంతి నిలవాలని

శాంతియుతం ధర్మపథం జనమంతా
ఏకంగా నడవాలని
కష్టఫలం కార్మికునికి తప్పకుండా దక్కాలని

ఘర్మజలం తడిసి నేల
బంగారం పండాలని

కోరుకునే కవిత
రావా లిప్పుడు

ఆ కవిత జనాన్ని
కదిలించా లిప్పుడు!

*

# విప్లవ సమరస్థలి

రండి, యువకులార
　　లెండి, యువకులార
విప్లవ సమరస్థలి
పిడికిలి బిగించి
పిలుస్తూంది!

కరం కలిపి
గళం కలితి
గజం గజం మునుముందుకు
క్షణ క్షణం విజయాలకు
తోరణాలు కట్టేందుకు
విప్లవ కవితలతో
గుండెలు వినదించేందుకు
రండి, యువకులార
లెండి, యువకులార

సామాజిక వైరుధ్యాలమధ్య
శాంతిగీతం మీటడానికి
తెరవెనక్కు వెళ్ళిన
శాంతిసౌభాగ్యాలను
జనంమధ్య నిలపడానికి
రండి, యువకులార
లెండి, యువకులార

విప్లవ సమరస్థలి
పిడికిలి బిగించి
పిలుస్తూంది

విప్లవ వీణ
వినదిస్తూంది
ప్రగతి గీతం
వినిపిస్తూంది!

*

# ఉగాదికి సన్మానపత్రం

కళ్లల్లో ఆశలు పెంచుకొని
కళ్ళలో ఒత్తులు వెలిగించుకొని
గుండె పొదిగట్ట తోరణాలు కట్టుకొని
పెదిమల్లో సరిగమలు ఆవిష్కరించుకొని
ఎదురుచూసిన ఉగాదిగా రొస్తున్నారు
పలకండి స్వాగతాలు
మ్రోగించండి నగారాలు
అరవై ఏళ్ళనాటి చరిత్రతో
తిరిగి అరవై ఏళ్ళకు వచ్చిన
నవ వత్సరంగారికి
పలకండి స్వాగతాలు!
స్వాగతపత్రం సన్మానపత్రం
ఘనాపాటీలచేత రాయించండి
బిరుదాలు పొగడ్తలు
కమ్మని అక్షరాలలో పలికించండి!
మీరు వస్తున్నారని
చైత్రరథంలో బయలుదేరారని
చలాకీగా వస్తున్నారని విని
మీ రాకకు అన్ని ఏర్పాట్లూ చేశాం—
తీరా మీరు చైత్రరథం దిగేప్పటికి
మీ సన్మాన ప్రణాళికా సంఘంవారు
అత్యవసరంగా ప్రణాళికలో
మార్పులు చేయక తప్పలేదు.
క్షమించండి, ఉగాదిగారూ!
మీరు పన్నెండు నెలలపాటు

రాజలాంఛనాలు పొందాలని
కలలు గని, ఆశలు పెంచుకొని
గాఢనమ్మకంతో వచ్చి ఉంటారు.
నవ ఉగాదిగారికి
ఇదే మా సుస్వాగతం!
పూలతో పందిళ్ళు వేయించాలనీ
వెలుగుతో వెల్లలు చిలికించాలనీ
ఆనందంతో తోరణాలు కట్టాలనీ
పూలకన్నెల నృత్యాలతో
ప్రకృతిపీఠంలో మీకు
సన్మానం నిర్వహించాలనీ
మా ప్రణాళికలో ప్లానులు వేశాం!
పంచభక్ష్య పరమాన్నాలతో
విందులు చేద్దామనీ
కొత్త పంచాంగంలో
మీ ప్రతిభా విశేషాల చిట్టావర్జాలు
ప్రజలకు వినిపించి
మీ గొప్పతనానికి విజయపతాకం
అలంకరించి ఆశలను, ఆశయాలను
పండించుకోవాలనీ పథకం వేశాం!
తీరా మీరు వస్తున్నారని తెలిసి
అత్యవసరంగా ప్రణాళికా సంఘాన్ని
సమావేశపరచాం.
పాలూ పంచదారా, బియ్యం పప్పులూ
అన్నీ మాయమైనాయి.
ఉల్లిపాయలుసైతం ఓడెక్కాయి.
ధరలు కొండెక్కి కూర్చున్నాయి.
జనాన్ని గుంపులుగా రమ్మనీ

వస్తూ నవ్వులూ పువ్వులూ తెమ్మనీ
దండోరా వేయించాం!
ఆశలు అడియాస లైనవారూ
స్వప్నాలు ఫలించనివాళ్ళూ
తిండికీ గుడ్డకూ గూడుకూ
తికమకలో పడ్డ జనం
నవ్వడం మా శక్యం కాదన్నారు
కదిలే ఓపిక, స్వాగతాలు పలికే తీరిక
లేదని మూతి ముడిచారు.
పూలబాలలలోనూ ఏదో తెలియని
నిస్తబ్ధత మంచుపొగలా
ముఖాలలో అలముకొంది
ఏమిటర్రా అని అడిగితే
నా దేశంలో నావాళ్ళే మోసంతో
ముంచెత్తిన బ్రతుకులకు
పట్టిన పీడ ఇది!
వదలని దయ్యం ఇది
అని కన్నీరు పెట్టారు!
నవభారతంలో సామాన్యులకు
అందని అందాలూ
దొరకని సరుకులూ
అయిన నేడు
కొత్త ఉగాది వచ్చినా
పాత ఉగాది వెళ్ళినా
ఏదైనా పగటి కలే!
ఇదే మా కథ అన్నారు.
వెంటనే ప్రణాళికను మార్చేశాం
అత్యవసర పరిస్థితిని ప్రకటించి

దుబారా మాని పొదుపుకోసం
విందులు రద్దుచేశాం
వినోదాలు ఆపుచేశాం!
క్షమించండి, నవవత్సరంగారూ
ఇదే మా స్వాగతం!
నేటి తరంలో ఆకలి నృత్యం చేస్తూంది
అనారోగ్యం పీఠం వేసింది
అసంతృప్తి సింహాసనం ఏలుతూంది
చీకటి గుండెల్లో భయపెడుతూంది
ఉన్నవాడు మరీ ఉన్నవాడైనాడు
లేనివాడి బ్రతుకే ఒక సమస్యగా మారింది
వాళ్ళని పిలిచి కొత్త వత్సరంగా రొస్తున్నారని
నగారా వేసి వినిపించినా
ఉలుకూ పలుకూ లేదు
ఆనందం అసలే లేదు- పైగా
అపనమ్మకాలు కళ్ళల్లో బుస కొడుతున్నాయి!
ఏమిటి కారణం అని తల బాదుకొన్నాం—
ఏ వత్సరం వచ్చినా ఏ ప్రణాళిక వేసినా
బ్రతుకులు అతుకుల్లా చిరిగిన
సామాన్య జనాళికి జరిగేదీ ఒరిగేదీ లేదనీ
గుండె గుహలో వినిపించే ధ్వనులు
కొత్తగా వచ్చిన వత్సరంగారూ—
మా జీవనాడి సవ్వడి ఇది—
జీవన సంగీతంలో వినబడే
బ్రతుకు గతుకుల సరిగమలు ఇవి!
అయినా, కోపగించుకోకండి—
గాలివాటు మారుతూంది
జనంలో ఆలోచనలు పదును దేరుతూన్నాయి.

ఉన్నవాళ్ళ గాదెల్లో ధాన్యలక్ష్మికి
గదుల్లో ధనలక్ష్మికి
బందిఖానా విడిపించి,
కామందుల బంజర్లలో
పచ్చచేలను నవ్వించి
బీడుల్లో గంగమ్మను పరుగెత్తించి
నవ్వులతో జనాన్ని బ్రతికించాలని
ఆశల ఫలితాలతో జగాన్ని పండించాలని
సామాన్యుని గుండెవాకిలిలో
తృప్తిని వెలిగించి
కాగడాలు రగిలించాలని
ఈ తరం దీక్షగా ప్రజాళికను సిద్ధం చేస్తున్నాం!
తరంనుంచి తరానికి చారిత్రక సత్యాల
వారధిని కట్టడానికి
చైత్రరథ సారథిగా సామాన్యునికి
పవర్ ఆఫ్ అటార్నీ అందిస్తున్నాం!
గతంలో—అంటే అరవై ఏళ్ళనాడు
మీ రాక ఒక నవయుగోదయంగా
భావించి అందలాలు ఎక్కించి
ఆనందాలు పంచిన చరిత్ర కాదు ఇది
జనం ఆశలను దేశం ఉచ్ఛ్వాస
నిశ్వాసాలుగా ఊపిరిని దట్టించి
కాలానికి బాధ్యతలను అందిస్తున్నాం!
ఏ ఇంట్లోనూ ఏ గూడెంలోనూ
ఏ కొంపలోనూ ఏ గుండెలోనూ
పిండివంటలు దొరకవు
సంతోషాలు కనిపించవు

వేడినిట్టూర్పుల భుగభుగలు
వాడిచూపుల చురచురలు
రక్తాక్షరాల ప్రతిజ్ఞలూ తప్ప
మరేం కనిపించని తరం ఇది!
అయినా, నా జనం పక్షాన
నా దేశం పక్షాన నా తరం పక్షాన
ఒక్క వాగ్దానం—
సన్మానపత్రంలో పొందుపరుస్తున్నాను.
ఈ తరం ఎంత నిరాశా నిస్పృహలతో
నా తరం మరెంత బాధలతో
కత్తుల వంతెనమీద పరుగెడుతున్నా
అతని ఆశ — నవోదయమనీ
అతని ఆశయం సమసమాజమనీ
దానికి సత్యం శివం సుందరం
జీవస్పందన అనీ
నమ్మకంతో మనవిచేస్తూ
మా కలలను మా ఆశల ఆశయాల లోతుపాతులను
అర్థంచేసుకుని మాలో కలిపి
చైత్రోత్సవాన్ని నవతర ప్రస్థాన
యాత్రా దర్శనానికి పునాదిగా భావించి
అర్భకులూ సామాన్యులూ
సీతిని తింటూ నిజాయితీగా
బ్రతుకు బరువును మోస్తున్న
ఈ జనానికి అండగా నిలవమని
విజ్ఞప్తి చేస్తున్నాను!

ఫైవ్ స్టార్ హోటల్స్ మాకు వద్దు
బృందావన మందారాలు మాకు అవసరం లేదు
పద్మశ్రీల హారాల సన్మానాలు కోరడం లేదు
మేం కోరేది మమ్మల్ని మంచి గాలి పీల్చుకో నివ్వమనీ,
మంచిని పెంచుకొని మంచిని
పంచిపెట్టుకోనివ్వమనీ
నవ యుగోదయ రవిగా
ఈ తరాన్ని సాగిపోనివ్వమనీ కోరుతున్నాం!
ఉగాదిగారూ!
ఇప్పటికే చాలా చెప్పిన ట్లున్నాను.
ఆఖరిగా ఒక్క మనవి.
మానవత చిగురించేందుకు
మనసుల్లో మధువులు చిలికేందుకు
పూలబాసల సరాగాల గానాలు వినేందుకు
మనిషి స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు
కవిత సుమనోహర దివ్యానుభూతుల
వెన్నెల పడవల్లో పయనించి
నవ్యసాహితీ భారతీ పతాకాలను ఎగరేసేందుకు
మీరు కాస్త అండగా నిలవమని ప్రార్థిస్తున్నాం.
ఏడుకొండలవాణ్ణీ
వడ్డికాసులవాణ్ణీ
పానకాలరాయుణ్ణీ
కోరే స్థితిలో లేని నా తరం
నిజాయితీని తింటూ బ్రతికే
ఈ తరపు బృహత్ ప్రణాళికగా
మీ దృష్టికి తెస్తూ
ఈ వర్షం అయినా యువత
హర్షంతో పరవశించే

భూతల స్వర్గం సాధించే
సుందర స్వప్నం కావాలని
ఆ ఆశ ఫలించే తరుణంగా
మీ రాక ఒక సంకేతం కావాలని ఆశిస్తూ
చదువుతున్నాను స్వాగత సన్మానపత్రం!
మీరు వస్తున్నారన్న వార్త విని
సంతోషపడలేని అర్భక జనాళి
బ్రతుకుల్లో మండే బాధల గాథల్ని
అర్థం చేసుకుని
అందరినీ మనుషులుగా
అందరికీ స్వాతంత్ర్యంగా
దేశాన్ని చిత్రించే
భావి భాగ్యోదయ క్షణంగా
భావిస్తూ ఆశిస్తున్నాను!
రండి, ఉగాదిగారూ!
కలో గంజో అందమైన పేరుతో
పిలిచే బంగారుతీగల వరిబియ్యం
గంజితో మీకు విందు చేస్తున్నాం
పంచదార అనుకొనేరు
ఉప్పుతో అదీ అప్పుతో మీకు
ఉగాది విందు చేస్తున్నాం!
ఇదీ మాకు రోజు కో పూటే
అని విన్నవించుకొంటూ
పట్టిన చెమటను తుడుచుకొంటూ
దొంగవర్తకుల లంజవర్తకుల
బడాకామందుల బారినుంచి దేశాన్ని
జనాన్ని జగాన్ని
రక్షించే మీ ప్రయత్నాలకు

ఈ తరం అండను అందిస్తూ
సెలవు తీసుకొంటున్నాను.
నవసాహితీ సముచ్చయాల
రంగవల్లికల తోరణాల
అలంకరణలతో కొత్త వత్సరాన్ని
ఆవిష్కరించుకొంటున్నాను! !

*

# కన్నీటి హారతి

దేవుని చిరునామా తెలియనివాణ్ణి!
ఎవరిగుండెలోనూ నా
చిరునామా లేనివాణ్ణి!
నా కన్నుల్లో కురిసిన వెన్నెల జాడల్లో
నా కనుసన్నల్లో నవ్విన పువ్వుల్లో
మనసుకోసం ఎదురుచూసినవాణ్ణి
మనిషికోసం ఎదురుకాచినవాణ్ణి
మంచికై వెతుకులాడినవాణ్ణి!
రెక్కలుంటే ఎగిరి గగనంలో గాలించేవాణ్ణి
రూపం తెలిస్తే దేవుడికై వెతికేవాణ్ణి
గుండెగుడిలో జ్యోతినై వెలిగేవాణ్ణి
కనిపిస్తే ఆగమని అడిగేవాణ్ణి!
దేవుడి చిరునామా తెలియనివాణ్ణి!
ఎవరిగుండెలోనూ నా
చిరునామా లేనివాణ్ణి!
నేనే నీ జీవితప్రమిదనై నిలిచేవాడిని
ఆ దీపంలో నిన్ను నవ్వమనేవాణ్ణి
అడగలేక అడుగుతున్నా ఒక్కమాట—
వెంటవస్తానని, కడకంటా నిలుస్తానని
దేవుని మందిరంముందు
వెన్నెల జాసందీ తినిపించినప్పుడు

అనుకొన్న ఆశల కట్టుకున్న మాలలు
వాడవని నమ్మా నప్పుడు!
వాడినందుకు కన్నీటి హారతి
ఇస్తున్నా నిప్పుడు!!
దేవుడి చిరునామా తెలియనివాణ్ణి!
ఎవరిగుండెలోనూ నా
చిరునామా లేనివాణ్ణి!

# ఎల్లోరా ముద్రిత గ్రంథాలు

| | |
|---|---|
| రేపటి వసంతం | (వచన కవిత) |
| మన ప్రాచీన కళలు | (తెలుగు కళాచరిత్ర) |
| మధుర కవితలు | (జానపద సాహిత్య వ్యాసాలు) |
| కాలచక్రం | (నవల) |
| ప్రేమనీరాజనం | (నవల) |
| పరిసరాలు - ప్రభావాలు | (నవల) |
| గుడిగంటలు | (నవల) |
| కదలిపోయిన రైలుబండి | (కథానికలు) |
| జానపద గేయాలు | (మొదటి సంపుటి) |
| జానపద గేయాలు | (రెండవ సంపుటి) |
| సరాగాలు | (పల్లెపాటలు-వ్యాఖ్యానంతో) |
| చంద్రవదన | (బాలల నవల) |
| మందారాలు | (బాలల నవల) |
| పాతాళగృహం | (జానపద నవల) |
| పండుగల పాటలు | (బాలలకోసం) |
| భయంకరి పన్నాగం | (జానపద నవల) |
| పాపాయి పాటలు | (బాలగేయాలు) |
| డాక్టర్ కోకిల | (బాల కథలు) |
| సముద్రగర్భంలో | ( ,, ) |
| కోకిలమ్మ తెలివి | ( ,, ) |
| పూవులు మొగ్గలు | ( ,, ) |
| విచిత్ర కథలు | ( ,, ) |

త్వరలో ...

# సంధ్య దీపాలు

(సాంఘిక నవల)

—అముద్రితాలు—

ఈతరం నాతరం

(ఎల్లోరా కవితలు, సమీక్షలు)

కారుచీకట్లు కాంతిరేఖలు

(సాంఘిక నవల)

ప్రజల పాటలు

దేశి పదాలు

BCI

AOUA10113106

**...ARANGAALU**

(...nthology of Poetry)

by **ELLORA**

వచనకవిత్వం ప్రచారంలోకి వచ్చాక కవిత్వపు విలువలు పడిపోతున్నాయనేవారి వాదనను ఖండించడానికి ఎల్లోరా కవిత ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. అందం అంటూ ఉంటే ఉడుపులు ఏవితొడిగినా అందం ఇనుమడిస్తూనే ఉంటుంది. భావం అనేది ఘనంగా ఉండాలిగాని అది ఏ ఛందస్సులో చెప్పినా, మరొక లయలో పలికించినా అందంగానే ఉంటుందని నిరూపించాడు ఎల్లోరా. కవిత చెప్పడంలో తనదైన స్వచ్ఛందమైన మార్గాన్ని అవలంబించారు. అచ్చమైన స్వచ్ఛమైన తెలుగు కవిత చదవాలంటే ఎల్లోరా కవిత చదవాలి.

— ఇరువెంటి కృష్ణమూర్తి

"నవ్వే అగ్నిలో నిజాయితీ ఉంది" అన్నాడు ఎల్లోరా. పైన ఉదహరించిన ఎల్లోరా పంక్తి లోతుల్లోకి వెళితే అవనిమీద అగ్ని అవతరించిన నాటినుంచి నేటి అణుగర్భం వెలిగ్రక్కే మహాగ్నిదాకా లక్షల ఏండ్ల చరిత్ర ఉంది. ఒక్క పంక్తితోనే ఎందరి హృదయాలనో ఆకట్టుకున్న ఎల్లోరా తన కవితతో తెలుగు సాహిత్య ప్రపంచాన్ని ఆనంద భరితం చేశాడు. ఈయన భావన ఎంత విశిష్టమైనదో భావ వ్యక్తీకరణ అంత బలమైనది. ఎల్లోరా కవితలో నవత, మానవత, యువత కొట్టివచ్చినట్లు కనిపిస్తాయి. అభ్యుదయ భావబంధురాలయిన ఎల్లోరా కవితల్లో నినాదంకన్న అంతర్నాదం హెచ్చు. కవిత్వం లేని అభ్యుదయం, అభ్యుదయం లేని కవిత్వం నేను ఊహించలేను — ఈ రెంటి రమణీయమైన మేళవింపుకి కమణీయమైన ఉదాహరణ ఎల్లోరా కవిత.

— దాశరథి

తెలుగు సాహిత్య ఎడారిలో ఎల్లోరా కవిత ఒక నీలి ఒయాసిస్సు. కవితా ప్రస్థానంలో ఎల్లోరాకు ఏ కొరతా లేదు. కవిత్వం ఎప్పుడూ రెండు లక్షణాలు తృప్తి పరచాలి- ఒకటి "హ్వా" అనిపించాలి. రెండు నాలికమీద నర్తించ గలగాలి. ఈ రెండు లక్షణాలకు అవినాభావ సంబంధం ఉంది. నేను చెప్పిన రెండు లక్షణాలూ ఉండేలా అందరూ రాయ లేరు—ఎల్లోరా రాయగలడు. అందంగా కవిత్వం చెప్పగల ఒకరిద్దరిలో ఎల్లోరా ఒకరు.

— గుంటూరు శేషేంద్రశర్మ

13C

WRAPPER PRINTED AT MADRAS JOB PRESS, MADRAS 2

**మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B106 |
| పుస్తకం పేరు | విశృంఖల తరంగాలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | XCS |
| వెనుక అట్ట | XCS |
| మొత్తం పేజీలు | 167 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | C.I BCI |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | P Jayamma |
| పేజీలు విడదీసినది | P Jayamma |
| స్కాన్ చేసినది | Mamatha P |
| పరీక్ష చేసినది | MADHU MATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | [illegible] |